ప్రజాశక్తి

గురువారం 25 సెప్టెంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ఆగని తొలగింపులు

◆ విశాఖలో వీధిన పడుతున్న వేలాది కుటుంబాలు

◆ ఇప్పటికే 4 వేల దుకాణాలు, తోపుడుబండ్లపై ప్రభుత్వ 'బుల్‌డోజర్' చర్యలు

శివశక్తి నగర్‌లో బడ్డీ తొలగింపు

తమ పొట్టకొట్టొద్దంటూ చంటిబిడ్డతో ఆందోళనకు దిగిన బాధితురాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో చిరు వ్యాపారుల దుకాణాల తొలగింపులో 'బుల్‌డోజర్' చర్యలకు దిగుతున్న నగర పాలకులు, రాష్ట్ర ప్రభుత్వ తీరు తీవ్ర దుమారం రేపుతోంది. రోడ్డు పక్కన చిన్నపాటి వ్యాపారాలతో జీవించే పేదల ఊపిరి (ఉపాధి)ని 'ఆపరేషన్ లంగ్స్ 2.0' పేరుతో కొద్ది రోజులుగా తీసేస్తున్నారు. విశాఖ నగరంలో ఇప్పటి వరకూ నాలుగు వేల పైచిలుకు దుకాణాలను, తోపుడు బండ్లను అధికారులు తొలగించేశారు. ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహం పెల్లుబుకుతున్నా కూటమి సర్కారు లెక్కచేయడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల విశాఖకు పలుమార్లు గ్లోబల్ సదస్సులకొచ్చి ఇచ్చిన ఆదేశాలివేనా ? అంటూ ప్రజలు బాహాటంగా విమర్శిస్తున్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం పట్ల 'కూటమి' ఎలా మొండి వైఖరితో ఉందో దుకాణాల వ్యవహారంలోనూ అదే కనిపిస్తోంది. విశాఖ నగరంలో ఎక్కడా చిందర వందరగా దుకాణాలు, జనం ఉండకూడదన్న ఆలోచనతో ఈ దుస్సాహసం ప్రభుత్వం చేస్తున్నట్లు స్పష్టమవుతోంది. కార్పొరేటర్లంతా అధ్యయన యాత్ర పేర ఇతర రాష్ట్రాలకు, ఎమ్మెల్యేలంతా అసెంబ్లీ మిగతా 2లో..

చిరు వ్యాపారుల హక్కులను అణగదొక్కడం తగదు

సిఎం, చీఫ్ సెక్రటరీకి మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ లేఖ వార్త 2లో..

షీలానగర్ రోడ్డులో ఆందోళన చేపట్టిన పాల రైతులు

పాల రైతుల సమస్యలపై ఆందోళన

◆ నిర్బంధం ప్రయోగించిన పోలీసులు ◆ ఆరుగురు అరెస్టు

ప్రజాశక్తి - గాజువాక : పాల రైతుల సమస్యలను పరిష్కరించాలంటూ విశాఖ డెయిరీ పాల రైతుల సంఘం ఆధ్వర్యాన బుధవారం ఆందోళన చేపట్టారు. 'చలో విశాఖ డెయిరీ' పేరిట చేపట్టిన ఈ కార్యక్రమానికి ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో పాల రైతులు తరలివచ్చారు. వారిని షీలానగర్ ప్రాంతంలో పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకున్నారు. ఆరుగురిని అరెస్టు చేశారు. విశాఖ డెయిరీలో జరిగిన అవినీతిపై వేసిన హౌస్ కమిటీ విచారణ పూర్తి చేసి, దోషులను శిక్షించాలని, డెయిరీ ఆస్తులను కాపాడాలని, పాల సేకరణ ధర లీటర్‌కు కనీసం రూ.10 పెంచాలని, ప్రతి మూడు నెలలకూ బోనస్ ఇవ్వాలని, చనిపోయిన పాల రైతుల కుటుంబాలకు పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తూ పాల రైతులు ఈ ఆందోళనకు దిగారు. షీలానగర్ వద్ద జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ మాట్లాడారు. విశాఖ డెయిరీలో జరుగుతున్న అవినీతిని కప్పిపుచ్చుకునేందుకే డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్ కుమార్ బిజెపిలో చేరారని విమర్శించారు. విశాఖ డెయిరీ రోజుకు 3,50,000 లీటర్ల పాలు సేకరిస్తోందన్నారు. రైతులకు లీటర్‌కు మిగతా 2లో..

అరెస్టయిన నాయకులు

అంగముత్తుకు అదనపు బాధ్యతలు

వార్త 2లో..

బల్క్‌డ్రగ్ పార్కుపై కన్నెర్ర

వార్త 8లో..

సమ్మె ఒప్పంద జిఒలు విడుదల చేయాలి

వార్త 7లో..

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పేదల గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఆదేశించారు. బుధవారం గృహనిర్మాణ ప్రగతిపై హౌసింగ్ అధికారులు, స్పెషల్ అధికారులు, జోనల్ కమిషనర్లు అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. పురోగతి సాధించిన అధికారులను అభినందిస్తూ వెనుకబడిన వారి పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. 2026 మార్చి నాటికి గృహనిర్మాణ పనులు పూర్తి చేయాల్సి ఉన్నందున సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మార్చికి పూర్తి చేయకపోతే ఇంటితో పాటు స్థలం పట్టా కూడా రద్దు చేస్తామని లబ్ధిదారులకు తెలపాలన్నారు. ప్రభుత్వం అదనంగా ఇస్తున్న ఆర్థిక సహాయంపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి పథకం ద్వారా రోడ్లు డ్రైనేజీలు తదితర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు.. ప్రతి సచివాలయంలో జియో టాగింగ్ పూర్తి చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని, లక్ష్యసాధనలో వెనుకబడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఇన్‌చార్జి హౌసింగ్ పిడి సూరిబాబు, భీమిలి ఆర్డిఒ సంగీత్ మాధుర్, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, జోనల్ కమిషనర్లు, హౌసింగ్ డిఈలు,ఎఈలు పాల్గొన్నారు.

తీర భద్రతతో దేశ ఆర్థిక ప్రగతి

'స్వరక్ష మహోత్సవ్ - 2025' ప్రారంభంలో పలువురు వక్తలు

కార్యక్రమంలో పాల్గొన్న శ్రీభరత్, బాగ్చి, హెచ్‌ఎస్‌ఎల్, నేవీ అధికారులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

దేశ రక్షణ రంగం అభివృద్ధికి, ఆర్థిక వ్యవస్థ పటిష్టానికి మార్నిటైం సెక్యూరిటీ (తీర భద్రత) అత్యంత కీలకమని పలువురు వక్తలు వెల్లడించారు. నగరంలోని రాడిషన్ బ్లూ హోటల్‌లో బుధవారం ఉదయం 'స్వరక్ష మహోత్సవ్' - 2025 ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా 40 రక్షణ రంగ ఉత్పత్తులను అక్కడ ప్రదర్శించారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, విశాఖపట్నం ఎంపీ శ్రీభరత్, హిందుస్తాన్ షిప్‌యార్డ్ సిఎమ్‌డి కమడోర్ గిరిదీప్‌సింగ్, నేవల్ డాక్‌యార్డ్ రియర్ అడ్మిరల్ శాంతనూజ్, ఇండియన్ కోస్ట్ గార్డ్ డిఐజి మనీష్‌వర్మ గౌరవ అతిథులుగా హాజరయ్యారు. డిఫెన్స్, ఇండియన్ ఏరోస్పేస్ రంగాలకు చెందిన ఇండస్ట్రీ ప్రతినిధులు సదస్సులో పాల్గొన్నారు. ఎగ్జిబిషన్‌ను ఎంపీ ఎం.శ్రీభరత్, నగర పోలీస్ కమీషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు.

ఈ సందర్భంగా జరిగిన సదస్సులో ఏ సమయంలో యుద్ధం వచ్చినా ఆంధ్రప్రదేశ్ సిద్ధం అని చాటి చెప్పే దిశగా తీర భద్రత, ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి తమ శాఖలను తీర్చిదిద్దుతున్నామని పలువురు వివరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సిపి బాగ్చి మాట్లాడుతూ స్వరక్ష ఉద్దేశాన్ని తెలియజేశారు. ప్రస్తుతం పౌర సమాజాన్ని సైబర్ నేరాలు ఇబ్బందికి గురిచేస్తున్నాయన్నారు. నేరాల తీరు మారిందని, అన్‌మేన్డ్ డ్రోన్స్‌తో దాడులు జరుగుతున్నాయని తెలిపారు. వాటిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఎదుర్కోవాలన్నారు. ఈ క్రమంలో సైబర్ స్పేస్‌లోకి జొరబడాల్సి ఉందన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ రూ.లక్ష కోట్లను ఏరో స్పేస్, రక్షణ రంగ అంశాల కోసం బడ్జెట్‌లో కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో భద్రత అత్యంత కీలకమన్నారు. స్పేస్ రీసెర్చి లాంచింగ్ స్టేషన్లను శ్రీహరి కోటలో పెట్టామన్నారు. స్కై రూట్ ప్రైవేట్ స్పేస్ విస్తరణ చేపడుతున్నామన్నారు. తిరుపతిలో 300 ఎకరాలు సిద్ధమవుతున్నాయన్నారు. నగరంలో డ్రోన్స్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆగని తొలగింపులు

సమావేశాల నిమిత్తం అమరావతికి వెళ్లిన సమయాన్ని చూసుకుని 'వ్యూహాత్మకంగా' చిరు వ్యాపారులపై, వీధి విక్రయదారులపై జివిఎంసి అధికారులు దాడికి దిగినట్టు పలువురు చెప్పుకుంటున్నారు.

తాజా తొలగింపులు ఇలా..

ఎంవిపి.కాలనీ : జివిఎంసి జోన్ – 3 పరిధిలోని కృష్ణా కాలేజ్ రోడ్, హెచ్‌బి కాలనీ, సీతమ్మధార ప్రాంతాల్లో 65 దుకాణాలను జివిఎంసి అధికారులు తొలగించారు.

భీమునిపట్నం : స్థానిక బీచ్ రోడ్డులో ఆక్రమణల పేరుతో జివిఎంసి ఒకటో జోన్ అధికారులు కొన్ని బడ్డీలు తొలగించారు.

కొమ్మాది : శివశక్తి నగర్ రోడ్డులో ఇరువైపులా 32 దుకాణాలను తొలగించారు. దీంతో తమ జీవనాధారం లేకుండా పోయిందని చిరు వ్యాపారులు ఆందోళన చేపట్టారు.

చిరు వ్యాపారుల హక్కులను అణగదొక్కడం తగదు

- సిఎం, చీఫ్ సెక్రటరీకి మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ లేఖ

ప్రజాశక్తి – గ్రేటర్ విశాఖ బ్యూరో : కేంద్ర ప్రభుత్వం 2014లో దేశ వ్యాప్తంగా వీధి వ్యాపారుల హక్కుల గుర్తింపు, రక్షణ కోసం ప్రత్యేక చట్టాన్ని తెచ్చి, వారి సంక్షేమం కోసం ప్రధానమంత్రి స్వనిధి పథకాన్ని అమలు చేసినా జివిఎంసి అధికారులు వారి హక్కులను అణగదొక్కాలని చూడడం దారుణమని మాజీ ఐఎఎస్ అధికారి ఇఎఎస్.శర్మ పేర్కొన్నారు. ప్రభుత్వ తీరుపై బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబుకు, చీఫ్ సెక్రటరీకి ఆయన లేఖ రాశారు. 'వీధి వ్యాపారులు నగరాల్లో ఫుట్‌పాత్‌లు, రోడ్లపక్కన చిరు వ్యాపారాలతో జీవనోపాధి పొందుతారు. ప్రభుత్వం అలాంటి చిన్న కుటుంబాల విషయంలో నిర్లక్ష్యం తగదు. రాజ్యాంగంలో 21వ ఆర్టికల్ కింద వారి జీవన హక్కు ఉంది. కేంద్రం 2014లో అందుకే ఒక ప్రత్యేక చట్టం చేసింది. ఆ ప్రకారం వారి వ్యాపారాలకు నగరంలో అనుమతులు ఇవ్వాలి. వారిని తొలగించి నిర్వాసితులను చేయడం తగని పని. విశాఖలో అధికారులు చిన్న షాపులను క్రూరంగా తొలగించడం రాజ్యాంగ విరుద్ధం. ప్రైవేట్ కంపెనీలు, ధనికుల మీద చూపించే ప్రేమ నిస్సహాయులైన వీధి వ్యాపారులు, చిన్నకారు ప్రజలపై చూపకపోవడం బాధాకరం. వేలాది కోట్లు గడిస్తున్న టిసిఎస్, కాగ్నిజెంట్ వంటి ప్రైవేట్ కంపెనీలకు 99 పైసలకు రూ.కోట్లు విలువ చేసే భూములు ఇచ్చి మురికివాడ ప్రజల జీవనోపాధిని దెబ్బతీస్తారా ?. కూటమి ప్రభుత్వంలో పెద్దవాళ్లకు ఒక న్యాయం, చిన్నవారికి ఒక న్యాయమా ?. సిఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి పెద్ద భవనాలను నిర్మించే రాజకీయ నాయకుల మీద, ప్రభుత్వ భూములను ఆక్రమించుకునే ధనికుల మీద ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు. ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా రాజ్యాంగం ప్రకారం నడచుకుని చిరు వ్యాపారుల, ప్రజల హక్కులను రక్షిస్తారని ఆశిస్తున్నాను' అని ఆ లేఖలో ఇఎఎస్.శర్మ పేర్కొన్నారు. వీధి వ్యాపారస్తుల తొలగింపు పట్ల మానవ హక్కుల వేదిక అభ్యంతరం తెలిపింది. ఈ మేరకు వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.శరత్, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కె.అనురాధ, సమన్వయ కమిటీ సభ్యులు విఎస్.కృష్ణ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

తీర భద్రతతో దేశ ఆర్థిక ప్రగతి

కోసం కొన్ని సంస్థలు సిఎస్ఆర్ నిధులు ఇవ్వాలని కోరారు.

దేశ రక్షణ, తీర భద్రతను కాపాడేందుకే హిందుస్తాన్ షిప్‌యార్డ్ స్థాపన జరిగిందని షిప్‌యార్డ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కమడోర్ గిరిదీప్‌సింగ్ తెలిపారు. స్వదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీ నినాదంతో దేశంలోనే గ్రీన్‌ఫీల్డ్ షిప్‌యార్డుగా ఖ్యాతి చెందుతూ 200 షిప్‌లను నిర్మాణం చేసిందన్నారు. ఇండియన్ నేవీ, ఇండియన్ కోస్ట్‌గార్డ్, ఇతర వాణిజ్య అవసరాలకు రెండు వేల వెస్సెల్స్ రిపేర్లు చేసి ఈ కాలంలో ఇచ్చిందన్నారు. సముద్ర భద్రతేగాక దేశ ఆర్థిక, సాంకేతిక, పారిశ్రామిక భద్రత అత్యంత అవసరమన్నారు. 40 ఏళ్లలో హెచ్ఎస్ఎల్ రూ.20 వేల కోట్ల బుక్‌వేల్యూ ఆర్డర్లు షిప్‌యార్డ్ ఉద్యోగుల టీం వర్క్‌తో సాధించామన్నారు. పలు యుద్ధనౌకల ప్రాజెక్టులు చేపట్టామన్నారు. 2024–25లో రూ.213 కోట్ల నికర లాభం సాధించి క్రెడిట్ రేటింగ్ దిశగా పయనిస్తున్నామన్నారు. షిప్‌యార్డు ప్రాజెక్టులు, ప్రగతిని వివరించారు. తూర్పునౌకాదళం వైస్ రియర్ అడ్మిరల్ శాంతనూజ్ మాట్లాడుతూ 90 శాతం ప్రపంచ వాణిజ్యం సముద్రంపై జరుగుతోందన్నారు. ఇండియన్ నేవీ మారిటైం రక్షణ కోసం తన సేవలను విస్తరిస్తోందన్నారు. ఇప్పటికే నాలుగు షిప్‌లను తీర భద్రత కోసం సముద్రంలో ఉంచామన్నారు. ఇండియన్ కోస్ట్‌గార్డ్ డిఐజి మనీష్ వర్మ మాట్లాడుతూ ఐసిజి 1977లో ఏర్పాటై త్వరలో గోల్డెన్ జూబ్లీ జరుపుకోబోతుందన్నారు. 102 నౌకలు, 78 ఎయిర్‌క్రాఫ్ట్ ఐసిజి వద్ద ఉన్నాయన్నారు.

పాల రైతుల సమస్యలపై ఆందోళన

కేవలం రూ.28 మాత్రమే చెల్లిస్తున్నట్టు తెలిపారు. అదే సమయంలో వినియోగదారుల నుంచి మాత్రం లీటరుకు రూ.60 వరకూ వసూలు చేస్తున్నారన్నారు. ఈ విధంగా అన్ని ఖర్చులు పోనూ భారీగా లాభాలు ఆర్జిస్తోందన్నారు. అయినప్పటికీ గత సంవత్సరం రూ.19 కోట్ల నష్టం వాటిల్లిందని తప్పుడు లెక్కలు చూపిస్తున్నారన్నారు. కోపరేటివ్ యాక్ట్‌లో డెయిరీ ఉన్నప్పుడు రైతులకు మేలు జరిగేదన్నారు. కంపెనీ యాక్ట్‌లోకి మార్చిన తరువాత యాజమాన్యంలోని వారు వారి వ్యక్తిగత ఆదాయాన్ని పెంచుకుంటున్నారన్నారు. డెయిరీ ఆస్తులను దారి మళ్లిస్తున్నారని తెలిపారు. డెయిరీ అవినీతిపై శాసనసభ కమిటీ వేసి ఆరు నెలలు గడుస్తున్నప్పటికీ ఇంత వరకూ రిపోర్టులు అందజేయలేదన్నారు. ఏపి పాల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, బి.రాంబాబు మాట్లాడుతూ విశాఖ డెయిరీ ప్రస్థానాన్ని, ఇప్పుడు జరుగుతున్న అవినీతిని వివరించారు. కార్యక్రమంలో నాయకులు కర్రి అప్పారావు, గొంప కృష్ణమూర్తి, నాయనబాబు, వెలమల రమణ, సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

విశాఖ పోర్టు ఛైర్మన్‌గా

అంగముత్తుకు అదనపు బాధ్యతలు

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు అథారిటీ ఛైర్మన్‌గా డాక్టర్ ఎం.అంగముత్తుకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ బాధ్యతలు ఆరు నెలలపాటు లేదా కొత్త ఛైర్మన్ నియామకం జరిగే వరకు లేదా తదుపరి ఆదేశాలు వచ్చే వరకూ కొనసాగుతాయి. విశాఖ పోర్టు అథారిటీ ఛైర్మన్‌గా పనిచేస్తున్న అంగముత్తును ముంబయి పోర్టు అథారిటీ ఛైర్మన్‌గా నియమిస్తూ కేంద్ర పోర్టులు, నౌకలు, జల రవాణా మంత్రిత్వ శాఖ ఇటీవల ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ మేరకు ఆయన ఈ నెల 22న బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలోనే విశాఖ పోర్టు అదనపు బాధ్యతలనూ ప్రభుత్వం ఆయనకు అప్పగించింది. డాక్టర్ ఎం.అంగముత్తు 2023 మే 9 నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ 22 వరకు విశాఖ పోర్టులో సేవలందించారు. ఆయన ఉద్యోగ కాలంలో విపిఎ పలు రికార్డులను లిఖించింది. ప్రపంచ స్థాయి గుర్తింపు పొందింది.

నైపుణ్యాలతో మెరుగైన ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి– ఎంవిపి కాలనీ : నైపుణ్యాలతో మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని విశాఖ ఎంపి ఎం.శ్రీ భరత్ అన్నారు. బీచ్‌రోడ్‌లోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వేదికగా 31వ ఎస్ఎన్ఎఐ ద్వై వార్షిక రాష్ట్రస్థాయి సదస్సు 2025 ప్రారంభమైంది. ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ ప్రాంతీయ శాఖ ఈ కార్యక్రమాన్ని ' లెర్నింగ్ టుడే – లీడింగ్ టుమారో ద జర్నీ ఆఫ్ ఏ నర్సింగ్ స్టూడెంట్' అనే అంశంపై నిర్వహిస్తోంది. ముందుగా ఫ్లోరెన్స్ నైటింగేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపి శ్రీ భరత్ మాట్లాడుతూ విద్య మెరుగైన అవకాశాలను కల్పిస్తుందన్నారు. నర్సింగ్ విద్యార్థులకు విదేశాల్లో సైతం మెరుగైన అవకాశాలు లభిస్తున్నాయ న్నారు. సదస్సు ప్రత్యేక సంచికను ఈ సందర్భంగా ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఇండియన్ రెసిసిటేషన్ ఫెడరేషన్ కౌన్సిల్ ఛైర్మన్ డాక్టర్ ఎస్.ఎస్.సి చక్రరావు మాట్లాడుతూ ప్రజలకు వివిధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించడం పై దృష్టి పెట్టాలని సూచించారు. ట్రైన్డ్ నర్సెస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షురాలు(సౌత్ రీజియన్) డాక్టర్ బి.వల్లి మాట్లాడుతూ వైద్య విద్యార్థులకు విభిన్నకోర్సులు, ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. తమ ఆధ్వర్యంలో ప్రచురితమవుతున్న శాస్త్రీయ జర్నల్ విశేషాలు విద్యార్థులకు వివరించారు.

కార్యక్రమంలో టిఎన్ఎఐ ఆంధ్రప్రదేశ్ శాఖ అధ్యక్షురాలు డాక్టర్ సి.ఆర్ షంషీర్ బేగం, టిఎన్ఎఐ కార్యదర్శి ఎన్ఎంసి రిజిస్ట్రార్ ఆచార్య కె. సుశీల, ఆంధ్రప్రదేశ్ నర్సింగ్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఆచార్య ఎస్.జ్యోతి, ఎస్ఎన్ఎ సలహాదారు డాక్టర్ ఎం.సత్యవల్లి, ప్రెస్ అండ్ పబ్లిసిటీ ఛైర్‌పర్సన్ ప్రీతం లూక్స్, కో ఛైర్‌పర్సన్ చంద్రశేఖర్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఇమ్మడి సిల్వర్ జ్యూయలరీ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి – విశాఖ కలెక్టరేట్ : ఆర్టిసి కాంప్లెక్స్ సమీపం సంపత్ వినాయఘర్ రోడ్డులో కొత్తగా ఏర్పాటు చేసిన ఇమ్మడి సిల్వర్ జ్యూయలరీ షోరూంను సంస్థ సిఇఒ ఇమ్మడి సునీత, ఛైర్మన్ ఇమ్మడి రమేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ భారతదేశంలో అతి పెద్ద వెండి ఆభరణాల బ్రాండ్‌గా ప్రసిద్ధి చెందిన ఇమ్మడి సిల్వర్ జ్యువలరీ, విశాఖపట్నంలో తన 14 వ షోరూంని ప్రారంభించిందన్నారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా, కస్టమర్లకు బంపర్‌ఆఫర్లను అందిస్తోందని లక్ష రూపాయల కొనుగోళ్లపై రూ.50 వేల విలువగల సెలెక్టెడ్ సిల్వర్ జ్యువలరీ ఉచితమని, రూ.50 వేల విలువగల సిల్వర్ జ్యువలరీ కొనుగోళ్లపై రూ. 25 వేల విలువ గల సెలెక్టెడ్ సిల్వర్ జ్యువలరీ ఉచితం అన్నారు.

అలాగే రూ.25 వేల కొనుగోళ్లపై రూ.12,500 విలువ గల పెర్ల్ నక్లెసు ఉచితం, రూ.10 వేల విలువగల సిల్వర్ జ్యువలరీ కొనుగోళ్లపై రూ. 5 వేల విలువ గల పెర్ల్‌మాల ఉచితమన్నారు. సమావేశంలో జ్యువలరీ డైరెక్టర్లు రాకేష్,జాబిలి, రాజేష్,మౌనిక పాల్గొన్నారు.

వచ్చే నెల 25, 26న రాష్ట్ర స్థాయి యోగా పోటీలు

ప్రజాశక్తి– విశాఖ కలెక్టరేట్: రాష్ట్రస్థాయి యోగా పోటీలను వచ్చేనెల 25,26 తేదీల్లో విశాఖపట్నం వెంకోజీపాలెం సిఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్టు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షులు కె.ఎ.రాజు తెలిపారు. బుధవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి బాలబాలికలు, యువత, 60 ఏళ్ళు పైబడిన వారికి ఈ పోటీలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సుమారు 500 మంది దీనిలో పాల్గొంటారన్నారు. 8 గ్రూపులుగా విభజించి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన విజేతలకు డిసెంబర్ 27,28,29వ తేదీల్లో బాపట్లలో నిర్వహించే 44వ జాతీయ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో పాల్గొనదల్చిన అభ్యర్థులకు అక్టోబర్ 24న సిఎంఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఎంపిక పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి కలిగినవారు 9948215863, 9866077307, 93333 33344 నెంబర్లను సంప్రదించవచ్చునని తెలిపారు.

26న జాబ్‌మేళా

ప్రజాశక్తి–ఎంవిపి కాలని: స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 26న కంచరపాలెం ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి చాముండేశ్వరరావు తెలిపారు. ఈ జాబ్‌మేళాలో పదికి పైగా కంపెనీలు పాల్గొంటాయని, 900కి పైగా ఖాళీల భర్తీకి అవకాశం ఉంటుందని అన్నారు. పదో తరగతి నుంచి డిగ్రీ చదివిన ఆసక్తి గల అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని అడ్మిట్ కార్డ్‌తో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

సివిల్ ఇంజనీరింగ్‌లో లావణ్య రేఖకు డాక్టరేట్

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ: ఆంధ్రవిశ్వవిద్యాలయం సివిల్ ఇంజనీరింగ్ విభాగం పరిశోధన విద్యార్థిని పైలా లావణ్య రేఖకు డాక్టరేట్ లభించింది. సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి ఆచార్య సి.ఎన్.వి. సత్యనారాయణరెడ్డి మార్గదర్శకత్వంలో రహదారుల నిర్మాణంలో నేలపై భాగంలో ఉండే మట్టి (సబ్‌గ్రేడ్ సాయిల్ (స్ట్రెంత్) నాణ్యత, పటిష్టతను గుర్తించడానికి సులభమైన విధానాలను రూపొందించినందుకు డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఎయు విసి ఆచార్య జి.పి రాజశేఖర్ నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను లావణ్యరేఖ అందుకున్నారు. రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, డీన్ అకాడమిక్స్ ఆచార్య కె.శ్రీనివాసరావు, డిపార్ట్‌మెంట్ హెడ్ ఆచార్య సి.ఎన్.వి. సత్యనారాయణరెడ్డి, సివిల్ ఇంజనీరింగ్ విభాగ అధ్యాపకులు, పరిశోధకులు ఆమెను అభినందించారు.

IN THE HONOURABLE COURT OF THE II ADDL. SENIOR CIVIL JUDGE AT VISAKHAPATNAM
I.A. No. 175 / 25 in 1.P. No. 20/2025

Between:
Kolli Chellam Naidu, S/o. Yeruku Naidu, Hindu, aged 53 years, residing at D.No.38-31-162(8), Green Gardens, Marripalem, Visakhapatnam-530018 ....Petitioner/Petitioner

And:
Sri. Yerra Apparao, S/o. Appalanaidu, Hindu, Private finance Business, R/o Cheedikada (P.O.), Cheedikada Mandal, Anakapalli District - 531028, and C/o. CTO Office. Opp.Q Hospital, Chinagadhili, Visakhapatnam-530040, Aadhaar No. Not known, Mobile No. 9440762450
2 Sri. Boddu Sivaprakash, Father's name of this respondent is not known to the petitioner, Hindu, Private finance Business, C/o CTO Office, Opp.Q Hospital, Chinagadhili, Visakhapatnam-530040, Aadhaar No. Not known, Mobile No. 8686631698.
3. Sri. Boddakayala Appalanaidu, S/o. late Kalyanam, Hindu, R/o Cheedikada (P.O.), Cheedikada Mandal, Anakapalli District 531028, Aadhaar No. Not known, Mobile No.9848778596
4.Sri. Penaganti Appalanaidu, S/o Alhibabu, Hindu, Private finance Business, R/o Cheedikada (P.O.), Chordikada Mandal, Anakapalli District-531028, Aadhaar No. Not known, Mobile No. 9949960791.
5. Sri. Boddu Sreerama Murthy, S/o. Mallu Naidu, Hindu, private finance business, R/o Cheedikada (P.O.), Cheedikada Mandal, Anakapalli District-531028. Aadhaar No. Not known, Mobile No. 9440713517.
6. Sri. Kolli Jaggibabu, S/o Chinna Demudu, Hindu, Private finance Business, R/o. Cheedikada (P.O.), Cheedikada Mandal, Anakapalli District-531028. Aadhaar No. Not known, Mobile No. 8978361885.
7.Sri. Kolli Ganapathi, S/o Chima Demudu, Hindu, Private finance Business, Ro Cheedikada (P.O.), Cheedikada Mandal, Anakapalli District-531028. Aadhaar No. Not known, Mobile No. 6300382296.
8.Sri. B.Rama Rao, S/o Dalimaida, complete surname is not known to the petitioner, Hindu, Business, R/o D.No. 4-135/4, Aditya nagar, Pendurthi, Visakhapatnam-531173. Aadhaar No. Not known, Mobile No. 9885155470.
9 Sri. Pillela Kishore Kumar, S/o Prasada Rao, Hindu, Business, R/o. D.No. 1-2-138, VUDA Colony, Near Sivalayan. Chinamusidiwada, Visakhapatnam -531173 Aadhaar No. Not known. Mobile No. 9398254557.
10. Sri. S.Demudu Naidu, complete surname and Father's name of this respondent is not known to the petitioner, Hindu, Rio Cheedikada (P.O.), Cheedikada. Mandal, Anakapalli District-531028. Aadhaar No. Not known, Mobile No. 9676151173.
11. Sri. P.Srikanth, complete surname and Father's name of this respondent is not known to the petitioner, Hindu, Private finance Business, 30047-301/12. Sai Maharaj Heights, Ravi Nagar, Naidu Thota, Visakhapatnam-530047. Aadhaar No. Not known, Mobile No. 9652234544.
12. known to the petitioner, Hindu, Business, R/o D.No. 17-171. Sri Saimadhava Nagar, Sri. P. Venugopal, complete surname and Father's name of this respondent is not Visakhapatnam-530047. Aadhaar No. Not known Mobile No. 9666047036
13. Smt. K. Tharangini, W/o K.B.S. Koushik, complete surname is not known to the petitioner, Hindu, Home maker, R/o D. No. 9-301/12, Sai Maharaj Heights, Ravi Nagar, Visakhapatnam-530047.
14. Sri. Beela Demudu, S/o Demudu, Hindu, Private Business, Rio Gullepalli (P.O. Sabhavaram mandal, Anakapalli District-531035. Aadhaar No. Not known, Mobile No. 9052332004.
15. Sri. Sabhavarapu, Srirama Murthy, Father's name of this respondent is not known to the petitioner, Hindu, Private Business, Rio Gullepalli (P.O.) Sabbavaram Kandal, Anakapalli District-531035. Aadhar No. Not known, Mobile No. 7792773025
16. Sri. Argi Kondala Rao, Father's name of this respondent is not known to the petitioner, Hindu, Private finance Business, R/o Cheedikada (P.O.), Cheodikada Mandal, Anakapalli District 531028 Aadhaar No. Not known, Mobile No. 9160609309.
17. Sri. M. Tarakeswara Rao, compiste suaname and Father's name of this respondent is not known to the petitioner, Hindu, Private finance business, R/o Cheedikada (P.O.), Cheedikada Mandal, Arakapalli District-531028. Aadhaar No. Not known, Mobile No. 7013434097.
18. Sri. Bobbili Mutyala Naidu, Father's name of this respondent is not known to the petitioner, Hindu, Teacher, R/o Cheedikada (PO), Cheodicada Mandal, Anakapaili District-531028. Aadhaar No. Not known, Mobile No. 9160607548 . . . Responderás Respondens

GENERAL NOTICE

The Publice are hereby inform that the above petitioners filed a above I.A. 175/2025 in I.P. 20/2025 on the file of the Honourable IInd additional Senior Civil Judge at Visakha patnam to declare them as an insolvent and the matter stands posted to **09-10-2025** for hearing so public are hereby informed that any objection can be raised in the above case here fore the Honourable Court on either in person or through an advocate at **10-30 A.M.**

(By Order of the Honourable Court)

D.MAHENDRA VARAMA
K.SUBRAHMANYAM
ADVOCATES
Visakhapatnam.
Date: 24.09.2025.
Visakhapatnam. Cell : 8885011225

20 బియ్యం బస్తాల వితరణ

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలం పాలవలస గ్రామంలోని అసెంట్ స్కూల్లో శుక్రవారం నుండి జరగనున్న 16వ జూనియర్ జాతీయ స్థాయి చౌక్ బాల్ పోటీల్లో పాల్గొనే క్రీడాకారుల భోజనాలు నిమిత్తం ఒఎస్‌జి ఫౌండేషన్ ప్రతినిధి శివథలాయి 20 రైస్ బ్యాగులను పాఠశాల ప్రిన్సిపాల్ కె.శంకరరావుకు అందజేశారు.

నేడు హైపర్ టెన్షన్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్ అవగాహన మాసోత్సవాన్ని పురస్కరించుకుని ఎల్‌వి.ప్రసాద్ నేత్ర వైద్యశాలలో గురువారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నేత్ర వైద్యశాల నిర్వహకులు తెలిపారు. ఈ జూమ్ సదస్సులో పాస్‌వర్డ్, ఐడి 4068102633, ఎల్‌విపిఇఐఎ2025 ద్వారా పాల్గొనవచ్చని తెలిపారు. వ్యక్తిగతంగా కూడా పాల్గొని ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్‌పై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఇడియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ టెన్షన్ అనేది మెదడు పరిసరాలలో ఒక రకమైన ద్రవ పదార్థం అధికం కావడం వల్ల తలలో ఒత్తిడి పెరగటం ద్వారా సంభవించే ఒక రకమైన వ్యాధి అని తెలిపారు.

బ్యాంకు సేవలపై అవగాహన

ప్రజాశక్తి -ఆనందపురం : ఆర్థిక సమీకృత సెట్యురేషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వేములవలస, బంటుపల్లి కల్లాలు, తాళ్లవలస గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రిజర్వ్ బ్యాంక్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ మహాన్ హాజరై ప్రజలకు ఆర్థిక రంగంలో బ్యాంకింగ్ సేవలను ఎలా వినియోగించుకోవాలో, అవినీతి సమస్యలుంటే ఎవరి దృష్టికి ఎలా తీసుకురావాలో వివరించారు. కార్యక్రమంలో విశాఖపట్నం రీజనల్ మేనేజర్ చిరంజీవి, చీఫ్ మేనేజర్ దిలీప్ శుక్లా పాల్గొన్నారు

పిఎసిఎస్ చైర్మన్‌గా పిజికె.వర్మ

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక పిఎసిఎస్ చైర్మన్‌గా భీమిలి మండలం తాళ్లవలస గ్రామానికి చెందిన పూసపాటి గోపాలకృష్ణవర్మ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన బుధవారం పిఎసిఎస్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు డిఎన్.రాజు పాల్గొన్నారు.

90 యూనిట్ల రక్త సేకరణ

ప్రజాశక్తి - ఆనందపురం: ఆనందపురం మండలం సొంట్యాం నడింపల్లి సత్యనారాయణ రాజు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. లయన్స్ క్లబ్ బ్లడ్ బ్యాంక్ సహకారంతో జరిగిన ఈ శిబిరంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు 90 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శంభు ప్రసాద్ మాట్లాడుతూ, ఒకరు రక్తదానం చేయడం ద్వారా ముగ్గురికి ప్రాణదానం చేసినట్లవుతుందని పేర్కొన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఎమ్ఒ డాక్టర్ సుబ్బరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ హరగోపాల్, ఫిజికల్ డైరెక్టర్ ఢిల్లీశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం

ప్రజాశక్తి- వేపగుంట : సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి నిత్య కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామి ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. భక్తుల, గోత్రనామాలతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలతో కమనీయంగా జరిపించారు.

'జిఎస్‌టి సంస్కరణలతో పన్నులు సరళం'

ప్రజాశక్తి-మధురవాడ : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ (జిఎస్‌టి) సంస్కరణలు భారతదేశ పన్నుల వ్యవస్థను సరళతరం చేస్తూ, పన్ను రేట్లను తగ్గిస్తూ, ఆత్మనిర్భర్ భారత్, వికసిత భారత్ లక్ష్యాలను చేరుకునే దిశగా ఉపయోగపడగలవని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం బిజినెస్ స్కూల్ బుధవారం నిర్వహించిన నిపుణుల సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన సిజిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ అభిషేక్ మజ్జి మాట్లాడుతూ, ఈ-ఇన్వాయిసింగ్, సులభమైన రిజిస్ట్రేషన్ స్కీములు, వ్యవసాయ రంగానికి సంబంధించిన జిఎస్‌టి మార్పులు యువతకు, రైతులకు ప్రయోజనకరంగా ఉండి, ఆత్మనిర్భరతను పెంపొందిస్తాయని తెలిపారు. కొత్త జిఎస్‌టి 2.0 ట్యాక్స్ స్లాబ్స్ ప్రకారం ఆరోగ్య బీమాలపై మినహాయింపులు, నిత్యావసర వస్తువులపై పన్ను తగ్గింపులు అమలులోకి వచ్చాయని వివరించారు.

గీతం బిజినెస్ స్కూల్ డీన్ ప్రొఫెసర్ రాజ ఫణి పప్పు మాట్లాడుతూ, యువత శక్తి ఎక్కువగా ఉన్న కేంద్రిత రంగాలైన విద్య, ఆటోమొబైల్, టెక్నాలజీ, టెక్స్‌టైల్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాలకు ప్రాధాన్యం ఇస్తూ, వ్యయాన్ని తగ్గించేందుకు వినూత్న ఆవిష్కరణలు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, అడ్మిషన్స్ చైర్ ఖుష్బు కుమారి తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరుచుకోవాలి

ప్రజాశక్తి -మధురవాడ : మంచి రచయితల నవలలు చదవడం, పబ్లిక్ స్పీకింగ్‌ను తరచూ ప్రాక్టీస్ చేయడం ద్వారా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను మెరుగుపరచుకోవాలని విద్యార్థులకు ఈస్ట్ నేవల్ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా సూచించారు. గీతం డీమ్డ్ టు బీ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లా విద్యార్థులను ఉద్దేశించి 'స్టోరీటెల్లింగ్: లా, లైఫ్‌లో మీ శ్రేష్టమైన ఆయుధం' అంశంపై బుధవారం ఆయన మాట్లాడారు. స్టోరీటెల్లింగ్‌కు ఏ రూల్సూ ఉండవని, ప్రతి ఒక్కరికీ తన జీవిత అనుభవాల ప్రకారం చెప్పుకునే శైలి ఉంటుందని పేర్కొన్నారు. ఇది ఒక కళగా అభివృద్ధి చేసుకోవాలని, పాఠశాల జీవితం నుంచి ప్రొఫెషనల్ జీవితం వరకూ ఇది ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ తమ కథను రాసుకుంటూ పోతే జీవిత ప్రయాణాన్ని మరింత విలువైనదిగా మార్చుకోవచ్చన్నారు. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లాడుతూ, లా విద్యార్థులు ప్రొఫెషనలిజాన్ని అభివృద్ధి చేసుకోవాలని, మూట్ కోర్టు, సమాజ సేవ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని కోరారు. కొత్త కొత్త చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గీతం స్కూల్ ఆఫ్ లా డీన్ ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణరావు, సీనియర్ అధ్యాపకులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

సమావేశంలో మాట్లాడుతున్న బాబాజీ

ప్రజాశక్తి -తగరపువలస : ఐక్య పోరాటాలతోనే హక్కులను సాధించుకోగలమని చిట్టివలస జ్యూట్ మిల్లు పింఛనుదారుల సంఘం నాయకులు పేర్కొన్నారు. చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో బుధ వారం పింఛనుదారుల సమావేశం నిర్వహించారు. సంఘం ప్రధాన కార్యదర్శి దామోదర బాబాజీ మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో ఇప్పటి వరకు పింఛనుదారులు జరిపిన పోరాటాల ద్వారా రూ.3 వేలు వరకు పింఛను పెంచే అవకాశం ఉందన్నారు. ఇదే సమయంలో త్వరలో ఢిల్లీలో జరుగనున్న ధర్నాలో పింఛను దారులందరూ పాల్గొనాలని కోరారు. సంఘం స్థానిక అధ్యక్షులు కానూరు రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ మెగా మారథాన్ విజేత కల్యాణ్

కల్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న చిన్నారులు

ప్రజాశక్తి-మధురవాడ : జర్మనీలోని బెల్జియంలో జరిగిన వరల్డ్ మెగా మారథాన్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరపున పాల్గొని పతకాలు సాధించి తిరిగి విశాఖకు చేరుకున్న పిఎం.పాలెం సమీపంలో ఉన్న కల్యాణ్ రోలర్ స్పోర్ట్స్ వ్యవస్థాపకులు కూరపాటి కల్యాణ్‌కు ఘన స్వాగతం లభించింది. రాష్ట్రం తరపున ఎంపికైన ఆయన ఈనెల 20వ తేదీన జరిగిన ఇన్ లైన్ స్పీడ్ స్కేటింగ్‌లో 42 కిలోమీటర్లు, 21వ తేదీన జరిగిన 42 కిలోమీటర్ల మారథాన్ పరుగు పోటీలలో సకాలంలో పూర్తి చేసి 54 ఏళ్ల వయసులో ఘనవిజయం సాధించారు. ప్రపంచవ్యాప్తంగా 181 దేశాల నుంచి 80 వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో 8 వేల మంది విజేతలుగా నిలిచారు. స్కేటింగ్ మాస్టర్ కె.కల్యాణ్ గతంలో ఇండియన్ స్కేటింగ్ మాజీ కోచ్‌గా బాధ్యతలు నిర్వహించారు. పతకాలు సాధించిన విశాఖ వచ్చిన కల్యాన్‌కు విశాఖ డిస్ట్రిక్ట్ రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్ చంద్ర, ఉపాధ్యక్షుడు కరణం గంగాధర్, జాయింట్ సెక్రెటరీ రాజ్‌కుమార్, అకాడమీ శిష్యులు, తల్లిదండ్రులు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు.

స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక శ్రీ బాసర లీడ్స్ ఇంటర్నేషనల్ స్కూల్లో బుధవారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ ఘనంగా నిర్వహించారు. ప్రీ ప్రైమరీ నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులు సైన్స్, గణితం, సోషల్ సబ్జెక్టుల్లో, వివిధ అంశాల్లో తమ ప్రతిభను కనబరిచారు. విద్యార్థుల సృజనాత్మకతను పలువురు అభినందించారు. స్కూల్ చైర్మన్ పూడి రమేష్, ప్రిన్సిపాల్ రేఖ, డీన్ భాస్కర్ , హెచ్‌ఎం కేశవ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లెడ్ కాన్ఫరెన్స్‌లో విద్యార్థులు

నేరాలు ఘోరాలు

మహిళ అదృశ్యం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి మండలం కొత్త మూలకుద్దు గ్రామానికి చెందిన కొయ్య గౌరి (29) ఈ నెల 21వ తేదీ నుంచి కనబడుటలేదని భర్త అప్పల గోవింద్ భీమిలి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. సిఐ బి.తిరుమలరావు కథనం ప్రకారం.. గౌరితో అప్పల గోవింద్‌కు సుమారు ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరిద్దరి మధ్య అప్పుడప్పుడు గొడవలు జరిగేవి. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లింది. పెద్దలు నచ్చచెప్పడంతో కొద్ది కాలం క్రితం అత్తవారింటికి వచ్చింది. అయితే ఈ నెల 21వ తేదీ ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన గౌరి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. నీలి రంగు దుస్తులు ధరించి ఉంది. భర్త ఫిర్యాదు మేరకు ఎఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేగు ఆరోగ్యం, హార్మోన్ల శ్రేయస్సుపై సదస్సు

ప్రజాశక్తి-సీతమ్మధార : డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాలలో పేగు ఆరోగ్యం, హార్మోన్ల శ్రేయస్సుపై బిఎస్‌సి విభాగం హెల్త్ క్లబ్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ సహకారంతో సదస్సు నిర్వహించారు. పేగు ఆరోగ్యం, హార్మోన్ల అసమతుల్యత ప్రీమెనోపాజ్ శ్రేయస్సు గురించి . పోషకాహార నిపుణులు కిరణ్మయి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జిఎస్‌కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేఖ పాల్గొన్నారు.

దళితులు రాజకీయ శక్తిగా ఎదగాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : దళితులు రాజకీయ శక్తిగా ఎదగాలని, రాజ్యాధికారం పొందితేనే అణగారిన వర్గాలకు విముక్తి అని అంబేద్కర్ భావించారని, ఆ దిశగానే ఆయన పోరాటం చేశారని దళిత బహుజన ఫ్రంట్ అధ్యక్షుడు కె.వినయ్‌కుమార్ పేర్కొన్నారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ భవన్‌లో 'పూణే ఒడంబడిక -దళిత రాజకీయాలపై దాని ప్రభావం' అనే అంశంపై బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆయన మాట్లాడుతూ, దళితులు రాజకీయ శక్తిగా ఎదగాలంటే ప్రత్యేక ఓటింగ్ పద్ధతి ద్వారా తమ అభ్యర్థులను తామే ఎన్నుకునే విధానం అమలు జరిగి ఉంటే నిజమైన దళిత ప్రతినిధులు ఎన్నికయ్యేవారని తెలిపారు. ఈ సదస్సులో డాక్టర్ జయరాజ్, జెవి.ప్రభాకర్, డాక్టర్ మాధురి శ్రీనివాస్, డాక్టర్ పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

వరిలో ఆరు తడి పద్ధతిపై శిక్షణ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలోని పొట్నూరు గ్రామంలో 60 మంది రైతులకు వరి పంటలో ఆరుతడి పద్ధతి విధానంపై ఒక రోజు శిక్షణను బుధవారం నిర్వహించారు. వరిలో ఆరుతడి పద్ధతిలో ఫీల్డ్ ట్యూబ్ పైపుల గురించి వివరించారు. దాన్ని ఏవిధంగా అమర్చుకోవాలి, దాని వలన కలిగే ఉపయోగాలు, నీటి శాతం తదితరాలపై రైతులు అప్పలనాయుడు, గురునాయుడు, కృష్ణ, విఆర్‌పి అప్పలరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎల్‌టి గణేష్ కుమార్, ఎన్ఎఫ్ ఎ.బాలామణి, ఐసిఆర్ఎఫ్‌లు రమణమ్మ, కుమారి హాజరయ్యారు.

సీఫుడ్ ఉత్పత్తుల భద్రతపై శిక్షణ

ప్రజాశక్తి -ఆనందపురం: ఎక్స్‌పోర్ట్ ఇన్స్పెక్షన్ ఏజెన్సీ గంభీరం సబ్‌ఆఫీస్ ప్రాంగణంలో 'సీఫుడ్ హెచ్ఎసిసిపి'పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. భారత ప్రభుత్వ వాణిజ్యం, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ శిక్షణను సిఐఎఫ్‌టి ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బి.మధుసూదనరావు, డిప్యూటీ డైరెక్టర్ ఇన్‌ఛార్జి జయపాలన్.జి, అసిస్టెంట్ డైరెక్టర్ ఇన్‌ఛార్జి సుధాన్సు శేఖర్‌దాస్ సమక్షంలో ప్రారంభించారు. సీఫుడ్ ఉత్పత్తుల భద్రత, నాణ్యతా ప్రమాణాలు, ఎగుమతుల కోసం అవసరమైన జాగ్రత్తలు వంటి అంశాలపై నిపుణులు వివరించారు. విశాఖపట్నం, కాకినాడ రీజియన్లకు చెందిన ఆమోదం పొందిన సీఫుడ్ ఎగుమతిదారుల సంస్థలకు చెందిన 25 మంది సాంకేతిక నిపుణులు ఈ శిక్షణలో పాల్గొన్నారు. ఈ శిక్షణ బుధవారం ముగిసింది. శిక్షణ పూర్తి చేసిన వారికి అధికారులు సర్టిఫికెట్లు అందజేశారు

సచ్చిదానందమూర్తి రచనలతో చైతన్యం

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆచార్య సచ్చిదానందమూర్తి రచనలు, పరిశోధనలు నిరంతరం మనల్ని చైతన్యవంతం చేస్తూ ఉంటాయని ఒడిశా రాష్ట్ర గవర్నర్ కె.హరిబాబు చెప్పారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏయూ తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఐసిపిఆర్ అంతర్జాతీయ సదస్సును ఆయన ప్రారంభించారు. 'ఎక్స్‌ప్లోరింగ్ ద ఫిలసాఫికల్ లెగసి ఆఫ్ ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి' అనే అంశంపై మూడు రోజుల సదస్సును నిర్వహిస్తున్నారు. ఆచార్య కె.సచ్చిదానంద మూర్తి విగ్రహానికి హరిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు.

సిపిఎం ఆధ్వర్యాన పాదయాత్ర చేస్తున్న ప్రజలు

అదాని సిమెంట్‌కు వ్యతిరేకంగా పాదయాత్ర

ప్రజాశక్తి -గాజువాక : అదాని సిమెంట్ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యాన పాత గాజువాక నుండి కొత్త గాజువాక వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్రనుద్దేశించి సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, గంగవరం పోర్టు కాలుష్యంతో గాజువాక ప్రజలు ఇబ్బంది పడుతుంటే, గోరుచుట్టుపై రోకలి పోటులాగ అదాని సిమెంట్ పరిశ్రమకు అనుమతులిచ్చారని ఆవేదన వ్యక్తంచేశారు. దీని వల్ల గాజువాక, పెదగంట్యాడ, మల్కాపురం ప్రాంతాల్లోని ప్రజలకు శ్వాసకోస, కేన్సర్ తదితర రోగాలు వచ్చే ప్రమాదం ఉందన్నారు. దీనిపై అక్టోబర్ 8వ తేదీన జరిగే పబ్లిక్ హియరింగ్‌లో అందరూ పాల్గొని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఎ.లోకేష్, జి.లక్ష్మి, కె.సంతోషం, కె.కిరీటం, రాము, ఎ.అవతారం పాల్గొన్నారు.

జగన్నాథరావు దంపతులను సన్మానిస్తున్న యూనియన్ నాయకులు

జగన్నాథరావు సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -గాజువాక : భెల్‌లో పనిచేసి బుధవారం ఉద్యోగ విరమణ పొందిన ఎస్.జగన్నాథరావు చేసిన సేవలు మరువలేనివవని భెల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జిటిపి ప్రకాశరావు అన్నారు. భెల్ సిఐటియు ఆఫీసులో బుధవారం సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్నాథరావు కంపెనీ రక్షణ కోసం జరిగిన అన్ని ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. సిఐటియు నాయకులు ఎన్.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ప్రస్తుతం ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్న నేపథ్యంలో జగన్నాథరావు సేవలు ఎంతైనా అవసరమన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలపై జరిగే పోరాటాల్లో భవిష్యత్తులో కూడా భాగస్వాములు కావాలని కోరారు. బిహెచ్‌పివి మాజీ ప్రధాన కార్యదర్శి స్వామినాథం మాట్లాడుతూ, అప్పుడు ఆర్ సిరీస్ పర్మినెంట్ విషయంలోనూ జరిగిన పోరాటాన్ని గుర్తుచేశారు. సన్మాన గ్రహీత ఎస్.జగన్నాథరావు మాట్లాడుతూ, కంపెనీ రక్షణ కోసం, ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా జరిగే పోరాటాల్లో తాను, తన భార్య కూడా పాల్గొనేవారమని గుర్తు చేశారు. ఉద్యోగ విరమణ పొందినా సరే తాను ఇదే పార్టీలో ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.నారపరెడ్డి, జి.అచ్చంనాయుడు, సీతన్నాయుడు, మురళీశ్వరరావు, నరసింహారావు, ఎస్.రామారావు పాల్గొన్నారు.

'ఎసిపిఆర్ఇఇ'పై అవగాహన

ప్రజాశక్తి- ములగాడ : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రారంభించిన ఎసిపిఆర్ఇఇ-2025 (స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయీస్) పథకంపై హిందూస్తాన్ షిప్‌యార్డ్ కార్యాలయంలో యజమానులు, ఉద్యోగులకు ఈఎస్ఐ ఉప ప్రాంతీయ అధికారులు, గాజువాక బ్రాంచ్ మేనేజర్ బుధవారం అవగాహన కల్పించారు. ఈఎస్ఐలో ఎవరైనా చేరకపోతే తక్షణమే చేరాలని, ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. 10 లేదా అంతకంటే ఎక్కువ మంది పనిచేస్తున్న కర్మాగారాలు, సంస్థలు సువిధ, ఎంసిఎ, ఇఎస్ఐసి పోర్టల్లలో నమోదు చేసుకోవచ్చని వివరించారు. సమావేశంలో ఈఎస్ఐ డిప్యూటీ డైరెక్టర్ ఎస్‌కె.సాహూ, అసిస్టెంట్ డైరెక్టర్ వి.శ్యామ్‌ప్రసాద్, గాజువాక బ్రాంచ్ మేనేజర్ ఎల్.కృష్ణప్రసాద్, అసిస్టెంట్ డి.చిరంజీవి, షిప్‌యార్డ్ కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న ఉద్యోగులు, ఈఎస్ఐ అధికారులు

దుకాణాలను యథావిధిగా కొనసాగించాలంటూ...

చిరు వ్యాపారుల ధర్నాలు

వేపగుంట జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

ప్రజాశక్తి- యంత్రాంగం

నగరంలో తొలగించిన దుకాణాలు, తోడు బండ్లను యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ చిరు వ్యాపారులు పలుచోట్ల బుధవారం ధర్నా నిర్వహించారు.

పెందుర్తి/ వేపగుంట : జివిఎంసి 8వ జోన్ కార్యాలయం వద్ద విశాఖ తోపుడుబండ్లు, చిల్లర వర్తక కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు బి.జగన్ మాట్లాడుతూ, నగరవ్యాప్తంగా 8 జోన్లు పరిధిలో సుమారుగా 2500 తోపుడుబండ్లు, బడ్డీలు తొలగించడం అన్యాయమని అన్నారు. ఉపాధి అవకాశాలు లేక తోపుడు బండ్లు, వీధి విక్రయదారులుగా వ్యాపారాలు చేసుకుని కుటుంబాలను పోషించుకుంటున్న వారిని తొలగించి రోడ్డుపాల్జేయడం సిగ్గుచేటన్నారు. తోపుడు బండ్లు, వీధివిక్రయదారులపై దాడులు ఆపాలని, పగలగొట్టిన తోపుడుబండ్లకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం తోపుడు బండ్ల, చిల్లర వర్తక కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, మురళి, బి.రమణి, అనసూయ, అప్పలనాయుడు, ప్రభుదేవా, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : తమను యాచకులుగా మార్చవద్దని చిల్లర వర్తకులు, తోపుడు బండ్లు కార్మికులు జోనల్ కార్యాలయం వద్ద భిక్షాటన చేపట్టి నిరసన తెలిపారు. పల్లాలు పట్టుకుని బాబ్బబ్బబాబు, ధర్మం చేయండంటూ నిరసన చేపట్టారు. చంద్రబాబు గారూ మమ్మల్ని యాచకులను చేయవద్దని, కుటుంబాలను రోడ్డుపాల్జేయొవద్దని, ఉపాధిని కాపాడాలని నినదించారు. సేవా రహదారిపై బైటాయించారు. దీంతో పిఎం.పాలెం పోలీసులు వచ్చి సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, పి.రాజుకుమార్ అరెస్టు చేశారు. ఆగ్రహం చెందిన కార్మికులు జీపు ఎదురుగా బైటాయించారు. దీంతో అరెస్టు చేసిన వారిని జీపు నుండి దించేశారు.

సీతమ్మధార : జివిఎంసి జోన్-3 కార్యాలయంలో వద్ద ధర్నా నిర్వహించారు. తోపుడు బండ్ల కార్మికులపై దాడులు ఆపాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పి.వెంకట్రావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎ.సింహాచలం, ఎ.అప్పారావు, దల్లి రవి, ప్రసాదు, శ్రీనివాసరాజు, 120 మంది తోపుడు బండ్ల కార్మికులు పాల్గొన్నారు.

అనకాపల్లి : అనకాపల్లి పట్టణంలో రోడ్ల పక్కన తోపుడుబండ్లు, చిన్నచిన్న దుకాణాలు పెట్టుకొని జీవిస్తున్న చిరు వ్యాపారులపై జీవీఎంసీ అధికారులు దౌర్జన్యాన్ని అరికట్టాలని, చిరు వ్యాపారులకు హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం జివిఎంసి అనకాపల్లి జోనల్ కార్యాలయం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పెద్ద పెద్ద కబ్జాదారులను, ఆక్రమణదారులను వదిలిపెట్టి పొట్ట కూటి కోసం రోడ్ల పక్కన వ్యాపారం చేసుకునే వారి దుకాణాలు తొలగించడం దారుణమన్నారు. ధర్నా అనంతరం జోనల్ కమిషనర్ చక్రవర్తిని కలిసి సమస్యను వివరించారు. దీనికి ఆయన స్పందిస్తూ పట్టణంలో చిరు వ్యాపారాలను గుర్తింపు సర్వే నిర్వహించి వారందరికీ గుర్తింపు కార్డులు ఇస్తామని, పట్టణంలో హాకర్స్ జోన్ ఏర్పాటు చేస్తామని, అప్పటివరకు చిన్న చిన్న దుకాణాలను తొలగించబోమని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అనకాపల్లి మండల కన్వీనర్ కాళ్ల తేలయ్యబాబు, శ్రీను, రమణ, లక్ష్మి, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ లంగ్స్ పేరుతో జీవీఎంసీ అధికారులు చేపట్టిన బడ్డీలు తొలగింపు, చిరు వ్యాపారులపై దాడులు ఆపాలని, చిరు వ్యాపారులకు నష్టపరిహారం చెల్లించాలని ఏపీ వీధి విక్రయ దారులు ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు.

విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో వెంకటేశ్వర థియేటర్ వద్ద ఉన్న జివిఎంసి జోన్ 4 కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సిఐటియు సీనియర్ నాయకులు వై.రాజు, జిల్లా ఉపాధ్యక్షులు ఎం.సుబ్బారావు మాట్లాడారు. నాయకులు కె.నర్సింగరావు, పోలవరపు వెంకట్, నాయుడు, శారద, వర పాల్గొన్నారు. అనంతరం జెడ్‌సికి వినతిపత్రం అందజేశారు.

మధురవాడలో రోడ్డుపై భిక్షాటన చేస్తూ బైఠాయించిన చిరు వ్యాపారులు

జోన్-3 కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న చిరు వ్యాపారులు

అప్పన్న నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి- వేపగుంట : శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామివారి దేవస్థానం నిత్యాన్నప్రసాదానికి గాజువాక శ్రీనగర్ కాలనీకి చెందిన మండవ మహేష్ రూ.1,00,116 విరాళం అందించారు. ఈ విరాళాన్ని పిఆర్ఒ ఆఫీసులో చెల్లించి రసీదు స్వీకరించారు. దాతకు ప్రోటోకాల్ పర్యవేక్షణాధికారి పి.సునీల్ కుమార్, పిఆర్ఒ నాయుడు నిత్యాన్నప్రసాదం బాండును అందజేశారు. అనంతరం దాత, కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

విశాఖ డెయిరీ టర్నోవర్ రూ.1755 కోట్లు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.1755 కోట్ల టర్నోవర్‌తో రూ.8.51 కోట్ల నికర లాభం ప్రకటించింది. అదే ఆర్థిక సంవత్సరంలో విశాఖ డెయిరీ 19.28 కోట్ల లీటర్ల పాలు, 5.84 కోట్ల కిలోల పెరుగును విక్రయించినట్లు ఛైర్మన్ ఎ.ఆనంద్ కుమార్ తెలిపారు. బిగ్‌బాస్కెట్, వాల్‌మార్ట్, మెట్రో, రిలయన్స్, స్పెన్సర్స్, డి-మార్ట్, విజేత మొదలైన అన్ని మోడరన్ ట్రేడ్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో విశాఖ డెయిరీ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయని వివరించారు. విశాఖ డెయిరీ జమ్మూ, కశ్మీర్, తూర్పు నేవల్ కమాండ్, అసోం, అరుణాచలప్రదేశ్ మొదలైన ప్రాంతాల్లో ఆర్మీకి 31.5 లక్షల లీటర్ల టెట్రాపాక్ పాలను సరఫరా చేసిందని తెలిపారు. విజయనగరం సోలార్ ప్లాంట్ 17.64 లక్షల యూనిట్లను ఉత్పత్తి చేసి ఎపిఇపిడిసిఎల్ గ్రిడ్‌కు సరఫరా చేసిందని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోని 3700 సేకరణ కేంద్రాలకు చెందిన 3 లక్షల మంది రైతుల నుండి కంపెనీ 28 కోట్ల లీటర్లకుపైగా పాలను సేకరించిందని తెలిపారు. వ్యాపార కార్యకలాపాలను విస్తరించడానికి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో ఎపి డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు చెందిన 7 బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్‌లను దీర్ఘకాలిక ఆపరేటింగ్ లీజుపై తీసుకున్నట్లు తెలిపారు. 45 సొసైటీలకు పాల సేకరణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి, 45 సొసైటీ భవనాలు, పాల సేకరణ పరికరాలు, ఆటోమేటిక్ మిల్క్ కలెక్షన్ యూనిట్ల నిర్మాణం కోసం జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు రుణం, గ్రాంట్‌ను మంజూరు చేసిందని పేర్కొన్నారు. 45 సొసైటీలకు 50 శాతం గ్రాంట్, కొత్త పశువుల దాణా ప్లాంట్ ఏర్పాటు కోసం మంజూరయ్యాయని తెలిపారు. గ్రామీణ విభాగంలో విశాఖ డెయిరీ మార్కెటింగ్ ప్రయత్నాలకు మద్దతు ఇవ్వాలని సొసైటీ అధ్యక్షులను అభ్యర్థించారు. శిక్షణ, సామర్థ్య అభివృద్ధి కింద 23 వేల మంది పాల ఉత్పత్తిదారులకు, సొసైటీ బోర్డు డైరెక్టర్లు, కార్యదర్శులు, ప్లాంట్ నిర్వహణ, మార్కెటింగ్ నిర్వహణకు కేంద్ర ప్రభుత్వం ద్వారా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విశాఖ డెయిరీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26కి రూ.2000 కోట్ల టర్నోవర్, రూ.20 కోట్ల లాభాన్ని సాధిస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు.

శ్రామిక కాంగ్రెస్ సెంట్రల్ ఆఫీస్ బేరర్‌గా మహేష్

ప్రజాశక్తి -మాధవధార : ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ ఎన్నికల్లో మాధవధార ప్రాంతానికి చెందిన రైల్వే ఉద్యోగి మూల మహేష్ సెంట్రల్ ఆఫీస్ బేరర్‌గా ఎన్నికయ్యారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక కాంగ్రెస్ సమావేశాలు విశాఖలో జరిగాయి. ఈ సందర్భంగా మూల మహేష్ మాట్లాడుతూ, రైల్వే ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న డిఎ అమలు, పే కమిషన్లపై పోరాడతానని తెలిపారు. ఈ సందర్భంగా మహేష్‌ను మాధవధార ప్రజలు, మాధవధార రైల్వే ఉద్యోగుల కార్మిక సంక్షేమ సంఘం సభ్యులు, పలువురు రైల్వే ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

మూల మహేష్‌ను అభినందిస్తున్న సభ్యులు

కలెక్టరేట్ వద్ద పంచాయతీ కార్మికుల ధర్నా

కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

ఏపీ గ్రామ పంచాయితీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు, హెల్త్ అలవెన్స్ అమలు చేయాలని, బకాయి జీతాలు చెల్లించాలని, 10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ కల్పించాలని, మున్సిపల్ కార్మికుల వలె రూ.21వేలు వేతనం చెల్లించాలని తదితర డిమాండ్లతో డిఆర్ఓ సత్యనారాయణరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకర్రావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో పారిశుధ్యం మెరుగుపరుస్తున్న పంచాయతీ కార్మికులకు వేతనాలు సక్రమంగా చెల్లించడం లేదని, నెలల తరబడి జీతం బకాయిలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రోలుగుంట మండలం గొట్టివాడలో 9 నెలలు, కే.నాయుడుపాలెంలో ఏడు నెలలు, మాడుగుల మండలం కోడూరులో రెండు సంవత్సరాలు, బుచ్చయ్యపేట మండలం గున్నెంపూడిలో ఏడు నెలలు ఇతర మండలాల్లో రెండు నుండి ఐదు నెలల వరకు జీతాలు బకాయిలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇచ్చే అరకొర జీతం కూడా నెల తరబడి బకాయి పెడితే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. మున్సిపల్ కార్మికులతో సమానంగా పనిచేస్తున్నా జీతాల్లో చాలా వ్యత్యాసం ఉందన్నారు. హైకోర్టు ఉత్తర్వులు ప్రకారం టెండర్లు రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటీవల ప్రభుత్వం ఇచ్చిన మెమో ప్రకారం జూలై నెల నుండి ప్రతి పంచాయతీ కార్మికుడికి హెల్త్ అలవెన్స్ కింద రూ.4వేలు పంచాయితీల్లో అమలు చేయాలని డిమాండ్ చేశారు. తక్షణమే పై సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమం సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.అప్పలరాజు, ఏ.నాగేశ్వరరావు, నాయకులు రవికుమార్, చిన్నారావు, ఈశ్వరరావు, వై.అర్జున, పరదేశి, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికులు

రక్తదానం చేస్తున్న అయ్యన్న విద్యా సంస్థల అధినేత ఖాశీం తదితరులు

'అయ్యన్న'లో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఎన్ఎస్ఎస్ ఫౌండేషన్ డే సందర్భంగా స్థానిక అయ్యన్న విద్యా సంస్థలలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఖాశీం, జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు స్వచ్ఛందంగా రక్త దానం చేశారు. ఈ సందర్భంగా ఎన్టిఆర్ బ్లడ్ బ్యాంకు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఉప్పాడ రమేష్ మాట్లాడుతూ దానం చేసిన రక్తం ఆపదలో ఉన్నవారి ప్రాణాలు కాపాడుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ డే సందర్భంగా కళాశాల ఆవరణలో సిహెచ్సి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రమేష్, డాక్టర్ ఖాశీం మొక్కలు నాటారు. కార్యక్రమాల్లో ఎన్ఎస్ఎస్ పీఓలు సీమునురు రమణ, గాడి అప్పారావు, ఎన్టిఆర్ బ్లడ్ సెంటర్ సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడులు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి- పాయకరావుపేట : నిరంతరం సమాజ శ్రేయస్సు కోసం పని చేస్తున్న పాత్రికేయులపై దాడులు, దౌర్జన్యం, బెదిరింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ గంట్లాన అప్పన్న స్పష్టం చేశారు. పాయకరావుపేట లీడర్ పత్రిక విలేకరిపై మండలంలోని ఈదటం గ్రామానికి చెందిన టిడిపి గ్రామ శాఖ అధ్యక్షుడు నేమాల సత్యనారాయణ (సత్తిబాబు) దౌర్జన్యానికి ప్రయత్నించిన విషయమై నియోజకవర్గంలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేఖరులు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్లో సిఐ అప్పన్నను కలిసి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ ఒక వినతి పత్రం అందజేశారు. విలేకరిపై దౌర్జన్యానికి ప్రయత్నించిన టిడిపి నాయకుడిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనికి స్పందించిన సిఐ అప్పన్న పాయకరావుపేట లీడర్ పత్రిక విలేఖరి రమేష్కు ఫోన్ చేసి బెదిరించడంతో పాటు దౌర్జన్యానికి ప్రయత్నించిన నేమాల సత్తిబాబును తహశీల్దారు ఎదుట బైండోవర్ చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు గట్టెం వెంకటరమణ, వెలగా లోవరాజు, శానాపతి లోవరాజు, నాయుడు వెంకటరమణ, అక్కిరెడ్డి వెంకట నాగేశ్వరరావు, ఇతర విలేకర్లు పాల్గొన్నారు.

చెరువును తలపించేలా ఉన్న వరి పొలాలు

నీట మునిగిన వరి పొలాలు

ప్రజాశక్తి-చోడవరం : కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు లక్ష్మీపురం చెరువు పూర్తిగా నిండిపోయింది. ఆ చెరువు నుండి విడుదలైన నీటితో కింద పొలాలు నేటి మునిగాయి. చెరువు కిందనున్న సుమారు 50 ఎకరాల వరకు పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో ప్రారంభ దశలోనే పంట నీటి మునగడంతో అపార నష్టం వాటిల్లుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్యాబ్, టాటా ఏస్ ఓనర్లు, డ్రైవర్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల 60 శాతం నష్టపోతున్న టాటా ఏస్, క్యాబ్ యజమానులు, డ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలని సిఐటియు మండల కన్వీనర్ కె సోమునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో బుధవారం డ్రైవర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వీరు ప్రతి ఏటా రోడ్ టాక్స్, ఇన్సూరెన్స్ కలిపి రూ.60 వేలు చెల్లిస్తున్నారని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంతో వీరు తీవ్రంగా నష్టపోతున్నారని, వీరికి ఏడాదికి రూ.30వేలు ఆర్థిక సాయం అందించాలని, రోడ్ టాక్స్, ఇన్సూరెన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె వరబాబు, బి శ్రీను, రాము, చిరంజీవి, మోహన్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దయా మాధురికి బెస్ట్ మెంటార్ అవార్డు

ప్రజాశక్తి-అనకాపల్లి : విజయనగరం జెఎన్టియులో నేషనల్ టీచర్స్ డే అవార్డ్స్-2025 ప్రదానోత్సవంలో జెఎన్టియూ వైస్ ఛాన్సలర్ ఆచార్య రాజ్యలక్ష్మి చేతులమీదుగా దాడి వీరునాయుడు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ దయామాధురి బెస్ట్ మెంటార్ అవార్డు అందుకున్నారు. కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ దయా మాధురిని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కోరిబిల్లి రమేష్ పాల్గొన్నారు.

బెస్ట్ మెంటార్ అవార్డు అందుకుంటున్న దయా మాధురి

ఆక్వా రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

మాట్లాడుతున్న మత్స్యశాఖ జిల్లా అధికారి విజయ

ప్రజాశక్తి-దేవరాపల్లి : జిల్లాలోని ఆక్వా రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా మత్స్యశాఖ అధికారిణి జి.విజయ సూచించారు. దేవరాపల్లి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన ఆక్వా రైతుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 1,862 చెరువులు 2,846 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్నాయని, వీటిలో 1,443 చెరువులకు అనుమతులు మంజూరయ్యాయని వివరించారు. దేవరాపల్లి మండలంలోనే 72 చెరువులు ఉన్నాయని, ప్రతి ఆక్వా రైతు పట్టాదారు పత్రం, నో అబ్జెక్షన్ సర్టిఫికేట్, ఆధార్, పంచాయితీ తీర్మానం సమర్పించి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని సూచించారు. జిల్లాలో ఉత్పత్తి అయ్యే రొయ్యలు అంతర్జాతీయ మార్కెట్లోకి కూడా వెళ్తున్నాయని వివరించారు. చేపల చెరువుల యజమానులు పౌల్ట్రీ వ్యర్థాలు లేదా నిషేధిత ఆహార పదార్థాలు వాడితే యాక్ట్-55 ప్రకారం కఠిన చర్యలు, రూ.2 లక్షల వరకు జరిమానాలు విధిస్తామని ఆమె హెచ్చరించారు.

ఎంపికైన ఉపాధ్యాయులకు భోజన ఏర్పాట్లు

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : డిఎస్సి-2025లో ఎంపికైన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయులకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యాన అడ్డరోడ్డులోని ఆదర్శ విద్యాలయంలో మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేశారు. డిఎస్సిలో ఎంపికైన వారికి ప్రభుత్వం అమరావతిలో గురువారం నియామక పత్రాలు అందజేయనుంది. ఆ కార్యక్రమానికి బయలుదేరిన ఉపాధ్యాయులకు భోజన వసతి కల్పించారు. అయితే బిర్యానీ, పెరుగు అన్నం మాత్రమే పెట్టడంతో పలువురు అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిఇఒ డి.అప్పారావునాయుడు, డిప్యూటీ డిఇఒ అప్పారావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం అనకాపల్లి డిప్యూటీ డీఈఓ అప్పారావు పాల్గొన్నారు.

పాయకరావుపేట : అమరావతిలో ఈ నెల 25న నియామక పత్రాలు అందుకొనేందుకు వెళ్తున్న డిఎస్సీలో కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయులకు బుధవారం పాయకరావుపేటలో రెండు చోట్ల భోజన ఏర్పాట్లు చేశారు. తిరుమల స్కూల్లో శ్రీకాకుళం జిల్లా అభ్యర్థులు సుమారు 1200 మందికి, గణేష్ హోటల్ దగ్గర విజయనగరం జిల్లాకు చెందిన 1500 మందికి విద్యా శాఖ అధికారులు భోజన ఏర్పాట్లు చేశారు. డిఇఒ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఇఓలు కెవిన్ గాంధీ, బి రమేష్ బాబు, పిడీలు టి రవి, ఎన్ రవి, సిఆర్ఎమ్టిలు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-కశింకోట : పశువులకు గాలి కుంటు వ్యాధిపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశుసంవర్ధకశాఖ ఉప సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని నూతనగుండుపాలెంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు కార్యక్రమాన్ని ఆయన బుధవారం పరిశీలించారు. నాలుగు నెలలు దాటిన దూడల నుంచి ఆరోగ్యంగా ఉన్న పశువులన్నింటికీ ఈ వ్యాధి రాకుండా టీకాలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింగబిల్లి పశు వైద్యులు ఆల్వాన్స్ జార్జ్, పశు వైద్య సిబ్బంది రఘువీర్, రాజేష్, భవాని పాల్గొన్నారు.

ఎంపిపిపై ఆర్డిఒకు అవిశ్వాస నోటీసు అందజేత

ప్రజాశక్తి-యలమంచిలి : మండల పరిషత్తు అధ్యక్షులు బోదెపు గోవిందరావుపై రేగుపాలెం ఎంపిటిసి సభ్యులు రాజాన సూర్యచంద్ర శేషగిరిరావు నేతృత్వంలో నలుగురు ఎంపిటిసిలు బుధవారం అనకాపల్లి ఆర్డిఒ షేక్ ఆయేషాకు అవిశ్వాస నోటీసు అందజేశారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు యలమంచిలి మండల అధికారికి కూడా అవిశ్వాస నోటీసు అందించారు. కార్యక్రమంలో ఎంపిటిసిలు ఉమాగణేష్ (జంపపాలెం), నగిరెడ్డి అమ్మాజీ (ఏటికొప్పాక), బర్రె శివలక్ష్మి (కొత్తలి) పాల్గొన్నారు.

ఆర్డిఒకు అవిశ్వాస నోటీసు ఇస్తున్న ఎంపిటిసి సభ్యులు

రుణాలపై వన్‌టైమ్ సెటిల్‌మెంట్ చేయాలి

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని నరసింగబిల్లి సహకార బ్యాంకు మహాజన సభ బుధవారం సాయంత్రం పర్సన్ ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యేశ్వరి అధ్యక్షతన జరిగింది. ఈ సభలో రైతులు మాట్లాడుతూ రుణాలపై వన్ టైం సెటిల్మెంట్ చేయాలని కోరారు. మహాజన సభలో 2024-25 ఫైనల్ ఆడిట్ రిపోర్ట్ ఆమోదం పొందింది. రైతుల డిమాండ్ మేరకు వన్ టైమ్ సెటిల్‌మెంట్‌కు సెంట్రల్ బ్యాంకు నివేదించడానికి, ప్రహరీ గోడ నిర్మాణం కోసం తీర్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉగ్గినిపాలెం సర్పంచ్ కలగ గున్నయ్య నాయుడు, మజ్జి నిరంజన్ కుమార్, కొన నాగేశ్వరరావు, కొట్టే రాము, కలిగెట్ల సింహాద్రి, కోసిరెడ్డి కన్నయ్య, మజ్జి ప్రకాష్, కోన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మహాజన సభలో పాల్గొన్న పర్సన్ ఇన్‌చార్జి తదితరులు

మాట్లాడుతున్న ఎంపిపి నాగేశ్వరిదేవి

'స్వస్థ్ నారీ' వైద్య శిబిరం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని చింతపాకలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ దాకారపు నాగేశ్వరి దేవి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో మహిళలు ఆరోగ్యపరంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వారు తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ గోలజాన శ్రీను, వైద్యాధికారి సునీల్ మాధవ్, సిబ్బంది పాల్గొన్నారు.

26న విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : కశింకోట 33/11 కెవి సబ్ స్టేషన్ మరమ్మతులు, హెచ్‌టి/ ఎల్‌టి లైన్లు కింద ఉన్న చెట్టుకొమ్మలు తొలగింపు కారణంగా కొత్తూరు సెక్షన్ కార్యాలయం పరిధిలో ఈ నెల 26న విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు కశింకోట డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తూరు, సత్యనారాయణపురం, మూలపేట, వేట జంగాల పాలెం, సంపతిపురం, కూండ్రం, కుంచంగి రొంగలివాని పాలెం, పిసినికాడ గ్రామాలకు ఉదయం 8 నుండి మధ్యాహ్నం 1 గంట వరకు గృహ అవసరాల విద్యుత్, వ్యవసాయ విద్యుత్ సరాఫరా నిలిపివేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

మునగపాక : స్థానిక 11 కెవి సబ్ స్టేషన్ మరమ్మత్తులు, ట్రీ కటింగ్ కారణాల చేత ఈ నెల 26న సబ్ స్టేషన్ పరిధిలోని మునగపాక టౌను, తిమ్మరాజుపేట, కొత్త నాగవరం, పాతనాగవరం, కుంచవానిపాలెం గ్రామాలకు ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఈఈ రామకృష్ణ బుధవారం ఒక ప్రకటనల తెలియజేశారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని అచ్చర్ల గ్రామంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ మనీషా ఆరోగ్య తనిఖీలు చేసి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర అధ్యక్షులు ఉగ్గిని రమణమూర్తి, ఎన్‌టిఆర్ హాస్పిటల్ డైరెక్టర్ ఉల్లింగల రమేష్, మజ్జి నిరంజన్ కుమార్, నైనంశెట్టి రమణారావు, దొడ్డి నాగేశ్వరరావు, గుడబండి జాన్, నిమ్మదాల సూరి అప్పలరాజు, నిమ్మదాల రామారావు, నైనంశెట్టి నాగేశ్వరరావు (బూష), నిమ్మదాల నాగేశ్వరరావు(బుజ్జి), రేషన్ షాపు డీలర్ మదిని ఈశ్వరరావు, కూటమి నాయకులు ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్యకర ఊపిరితోనే జీవన గమనం

- కిమ్స్ ఐకాన్ డాక్టర్ కెఎస్ ఫణేంద్ర

ప్రజాశక్తి -గాజువాక : మనిషి మనుగడలో కీలక పాత్ర వహించేది ఊపిరితిత్తులని కిమ్స్ ఐకాన్ హాస్పిటల్ డాక్టర్ కెఎస్ ఫణేంద్ర తెలిపారు. ఊపిరితిత్తులు శరీరానికి ఆక్సిజన్ ఇచ్చే ముఖ్యమైన అవయవాలు అని తెలిపారు. గాలిలో ఉన్న ధూళి, పొగ, కలుషిత పదార్థాలు, బ్యాక్టీరియా, వైరస్‌లు నేరుగా ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతాయని తెలిపారు. అధిక వాహనాలు, ఫ్యాక్టరీల నుంచి వెలువడుతున్న పొగతో విశాఖ ప్రజలు తీవ్ర కాలుష్యం బారిన పడుతున్నారని పేర్కొన్నారు. స్వచ్ఛమైన గాలి నానాటికి తగ్గిపోతోందని గణాంకాలు చెబుతున్నాయని, మనిషి ఊపిరితిత్తులపై ప్రభావం చూపుతాయని తెలిపారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

పొగ తాగడం మానేయడం, శుభ్రమైన గాలిని పీల్చే ప్రయత్నం చేయడం, మాస్క్ ధరించడం, మొక్కలు నాటడం, రోజూ నడక లేదా వ్యాయామం చేయడం, ఆకుకూరలు, పండ్లు తీసుకోవడం, ఫ్లూ, నిమోనియా వాక్సిన్లు వేయించుకోవడం తదితర అలవాట్లతో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రాసెసింగ్ ఫుడ్స్, వేయించిన పదార్థాలను తీసుకోవద్దని, నీరు ఎక్కువగా తాగాలని తెలిపారు.

అధ్వానంగా అన్నవరం రహదారి

చెరువును తలపిస్తున్న గోతులు - దశాబ్దాకాలంగా మరమ్మతులకు నోచని వైనం

పెద్ద పెద్ద గోతులు పడిన అన్నవరం రహదారి

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలోని అన్నవరం గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకొని అధ్వానంగా మారింది. దశాబ్ద కాలంగా ఎటువంటి మరమ్మతు పనులు చేపట్టకపోవడంతో ఎక్కడికక్కడ గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లో వర్షపు నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. పాదచారులు సైతం ఈ మార్గంలో వెళ్లడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఎండపల్లి అన్నవరం మీదుగా వేములపూడి వెళ్లే దాదాపు 5 కిలోమీటర్ల రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ప్రధానంగా రాత్రి సమయంలో ప్రయాణించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, నాయకులు ఎందరు మారినా రోడ్డు దుస్థితి ఇంతేనని గ్రామస్తులు, వాహనదారులు ఆవేదన ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంచనాలు రూపొందించామని, త్వరలో పనులు మొదలుపెడతామని అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. కాని కార్యరూపం దాల్చడంలేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు మంజూరు చేసి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జెఎన్‌టియు గురజాడ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రాజ్యలక్ష్మి కళాశాల ఆవరణలో మొక్క నాటారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సుమారు 200 మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ, డైరెక్టర్ ఎ.చంద్రశేఖర్, ఎన్ఎస్ఎస్ అధికారి షరీఫ్ పాల్గొన్నారు.

భీమిలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్-ఎస్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.సురేఖ, వైస్ ప్రిన్సిపల్ విష్ణు మూర్తి, ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రాం అధికారులు డి.ప్రవీణ, ఎస్అప్పలనాయుడు, శ్రీను, పాల్గొన్నారు.

అనకాపల్లి : జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని బుధవారం దాడి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ టెక్నాలజీ అటానమస్ కళాశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా కళాశాల చైర్మన్ దాడి రత్నాకర్ హాజరై ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలను అభినందించారు. కళాశాల దత్తత తీసుకున్న గ్రామాలలో ప్రతి సంవత్సరం ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.వైకుంఠ రావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్ ఏ కిరణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్స్, వాలంటీర్లు పాల్గొన్నారు.

మాడుగుల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకం దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సివిఎస్ఎస్ శాస్త్రి మాట్లాడుతూ సమాజంలో గుర్తింపును తీసుకొచ్చేది సేవ మాత్రమేనని, విద్యార్థి దశ నుండే సేవాభావాన్ని కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ జయలక్ష్మి,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎం రామ్‌కుమార్, పులవర్తి పైడిరాజు, జె షర్మిలశ్రీ, బి.రాజు, ఎస్ శ్రీనివాసరావు, ఎస్ పుల్లారావు, వి. అప్పలనాయుడు, బి. నారాయణ, కె.పి. నాగేశ్వరరావు, సులేమాన్, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందజేయాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ చంద్రశేఖర్

ప్రజాశక్తి-కోటవురట్ల : సంక్షేమ పథకాలు అర్హులకు అదే విధంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంజూరు చేసిన మినీ గోకులం షెడ్లతో పాటు వివిధ సంక్షేమ పథకాలు ఎంపికలో పారదర్శకత పాటించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. తాగునీరు, పారిశుధ్యం పట్ల నిర్లక్ష్యం వహించకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో కూర్మారావు, మండల వ్యవసాయ శాఖ అధికారి సరోజిని, గ్రామీణ నీటి సరఫరా ఇంజనీర్ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ వరప్రసాద్ పాల్గొన్నారు.

గోవాడ సుగర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : సహకార రంగంలో ఎంతో ఘన చరిత్ర కలిగిన గోవాడ చక్కెర కర్మాగారాన్ని కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని చెరకు రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేచలపు కాసుబాబు డిమాండ్ చేశారు. కె.కోటపాడులో బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన వాగ్దానం మేరకు నిధులు కేటాయించి కర్మాగారాన్ని ఆధునికీకరించాలని డిమాండ్ చేశారు. ఫ్యాక్టరీపై ఆధారపడిన వేలాది మంది సభ్య రైతులు, కార్మికుల భవిష్యత్తు నేడు అగమ్య గోచరంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు తీసుకొస్తామని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం రైతులకు కార్మికులకు ఉపయోగపడుతున్న గోవాడ చక్కెర కర్మాగారాన్ని ఆదుకోవలసిన అవసరం లేదా అని ప్రశ్నించారు. సమావేశంలో రైతు సంఘ ప్రతినిధులు కోరిబిల్లి శంకర్రావు, గొర్లె దేముడుబాబు, నరాలశెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒను కలిసిన నాయకులు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విధుల్లో చేరిన శివప్రసాద్‌ను బుధవారం పలు గ్రామాలకు చెందిన నాయకులు కలిసి శాలువాకప్పి సన్మానం చేశారు. కార్యక్రమంలో పోలేపల్లి చెందిన సీతా నాగరాజు, గొలగాని శ్రీనివాస్ యాదవ్, దొండ నానాజీ, షేక్ బాబ్జి, ఈశ్వరరావు, పిఎసిఎస్ డైరెక్టర్ సాయం అయ్యన్న, ముక్కా దేముళ్ళు తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-వడ్డాది : బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట కాజ్వే వద్ద మంగళవారం గల్లంతైన విద్యార్థి మృతదేహం బుధవారం లభ్యమైంది. విజయరామరాజుపేట గ్రామానికి చెందిన ఆడారి రోహిత్ (13) మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కాజ్వే వద్ద నీరు ప్రవాహాన్ని చూడడానికి వెళ్లారు. చెప్పులు నీటిలో పడిపోగా, వాటిని తీయడానికి ప్రయత్నించే సమయంలో కాలుజారి వాగులో ప్రవాహంలో కొట్టుకుపోయాడు. తల్లిదండ్రులకు పోలీసులకు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు రిస్క్ టీం అగ్నిమాపక సిబ్బంది మంగళవారం సాయంత్రం ఏడు గంటల వరకు గాలించారు. అయినా రోహిత్ ఆచూకీ లభ్యం కాలేదు. బుధవారం ఉదయం 8 గంటల నుండి తాచేరులో రిస్క్ స్టిమర్లతో గాలించారు. విజయరామరాజుపేట గాయత్రి డిగ్రీ కాలేజ్ ఎదురుగా ఉన్న నది ప్రవాహంలో చిక్కుకున్న రోహిత్ మృతదేహాన్ని గుర్తించారు. మృతదేహాన్ని బయటకు తీయగా, తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రకృతి వ్యవసాయ విధానం ద్వారా రైతు ఆదాయంతో పాటు భూమి సారవంతం అవుతుందని ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారి సిహెచ్ లచ్చన్న తెలిపారు. అనకాపల్లి జిల్లా ప్రకృతి వ్యవసాయ విభాగంలో విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు బిఆర్‌సి (బయో ఇన్పుట్స్ సెంటర్)లలో కషాయలు, ద్రావణాలపై 6వ బ్యాచ్‌కు నాలుగు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నారు. రెండవ రోజు బుధవారం మండలంలోని దిబ్బపాలెం గ్రామంలో బిఆర్‌సి సెంటర్ స్టేట్ యూనిట్ రిసోర్స్ పర్సన్స్ నరేంద్ర, రవికుమార్ మస్తాన్, బిఆర్‌సి ట్రైనర్ సమక్షంలో ఘన జీవామృతం, నీమాస్త్రం, వేప గింజలు కషాయం, బ్రహ్మాస్త్రం, అగ్నిఅస్త్రం, దశపర్ణి కషాయం, సప్త దాన్యాంకుర కషాయం, కోడి గ్రుడ్డు నిమ్మకాయ ద్రావణం, చేప బెల్లం ద్రావణం, ఆర్గానిక్ పోటాష్ తయారు చేశారు. కార్యక్రమంలో మూడు జిల్లాల బిఆర్‌సి ట్రైనర్స్ ఆర్.సింహాచలం డివిజన్ ఇంచార్జ్ ఎస్.అప్పలరాజు, మార్కెటింగ్ మాస్టర్ ట్రైనర్ కె.పెంటయ్య, యం.సత్యారావు. రైతులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో జగ్గారావు మిత్రమండలి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కీళ్ల వైద్య నిపుణులు కుమారస్వామి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

28న యలమంచిలిలో సినీ సంగీత విభావరి

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ సినీ గాయకులు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యం 5వ వర్ధంతి సందర్భంగా ఎస్‌పి బాలు సినీ సంగీత విభావరి కార్యక్రమం ఈ నెల 28న యలమంచిలిలో గుర్రప్ప కల్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు సిద్దార్థ సోషల్ సర్వీస్, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లా నాగభూషణం తెలిపారు. ఈ మేరకు కార్యక్రమం కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభావరిలో అనకాపల్లి, విశాఖ, విజయనగరం జిల్లాలలో నుండి ప్రముఖ గాయనీ గాయకులు సుమారు 40 మంది పాల్గొని తన గానామృతం వినిపిస్తారని పేర్కొన్నారు. దీనిని జయప్రదం చేయాలని కోరారు. అసోసియేషన్ ప్రతినిధులు వినకోట నీలేష్ గుప్తా, పట్నాల కృష్ణమోహన్, ఎర్రాజి సాయిరోషన్, రామచంద్రరావు, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పోషణ మాసోత్సవాలు

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం, బాటజంగాలపాలెం గ్రామాలలో 8వ రాష్ట్రీయ పోషణ పక్వాడ మాసోత్సవాలు బుధవారం నిర్వహించారు. పోషకాహార భద్రత, ఆరోగ్యకరమైన జీవనశైలిపై బాలింతలకు, పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సిడిపిఒ వి.లలిత కుమారి మాట్లాడుతూ ఈ నెల 17 నుండి అక్టోబర్ 16వరకు ఈ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సూపర్వైజర్ ఇందిర, వైసిపి నాయకులు గండి రవికుమార్, యడ్ల నాయుడు, సిరపరపు వాసు, సర్పంచ్ పడాల వెంకటరమణ, జిల్లా యాదవ సంఘం అధ్యక్షులు బర్నికాన సాయినాథరావు, వనం సత్యనారాయణ, కాపుశెట్టి నరసింహులు, అంగన్వాడీ, ఆశాలు పాల్గొన్నారు.

పోషణ పక్వాడ మాసోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

సమ్మె ఒప్పంద జిఓలు విడుదల చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

● సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : 17రోజుల సమ్మె సమయంలో మున్సిపల్ కార్మికులతో చేసుకున్న ఒప్పందాల అమలుకు అవసరమైన జిఓలు జారీ చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు డిమాండ్ చేశారు. బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. ఈసందర్భంగా రాజు మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులతో సహా ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న 12వ పిఆర్‌సిని కూటమి ప్రభుత్వం వెంటనే ప్రకటించ్చిచాలని, వేతనాల పెంపు, డిఎ, సరెండర్ లీవ్‌ల బకాయిలు చెల్లింపు, ఇతర ఆర్థిక సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు అమలు చేయాలని డిమాండ్ చేశారు జూలై నెలలో మున్సిపల్ కార్మికుల చేపట్టిన 17రోజుల సమ్మెకాలపు జీతం వెంటనే చెల్లించాలని కోరారు. 13 గంటల పనిదినాన్ని రద్దు చేయాలని, మహిళలతో రాత్రి పూట షిఫ్ట్‌లలో పనిచేయించే విధానానికి స్వస్తి పలకాలని, ఉద్యోగ విరమణ, చనిపోయిన కార్మికుల స్థానే వారి కుటుంబసభ్యులు, పిల్లలకు ఆప్కాస్ ద్వారా ద్యోగాలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ, మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎం. లోవరాజు, బాబూరావు, వి రమణ, నూకరాజు, సంపత్, అర్జమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

ఉచిత కంప్యూటర్ శిక్షణ ప్రారంభిస్తున్న ఎంపిపి, తదితరులు

ప్రజాశక్తి -కొత్తకోట :మారుమూల గ్రామాల్లోని పేదలకు మిషన్ జోష్ సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని రావికమతం ఎంపిపి పైలా రాజు, తలారి అదిమూర్తి అన్నారు. బుధవారం ధర్మవరం గ్రామంలో ఫాదర్ కె వర్గీస్ ఆధ్వర్యంలో జోష్ మిషన్ టెక్నో స్కూల్, ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జోష్ మిషన్ సంస్థ ద్వారా మూడేళ్లుగా గ్రామీణ పేదలకు ఉచిత వైద్యఆరోగ్యసేవలు అందిస్తున్నారని, ఇపుడు నిరుద్యోగ యువతకు ఉచిత కంప్యూటర్ శిక్షణ అందించడం అభినందనీయమన్నారు 40మంది యువకులను శిక్షణకు ఎంపిక చేశారన్నారు. టిడిపి మండల మాజీ అధ్యక్షులు రాజాన కొండనాయుడు, తెలుగు మహిళ అధ్యక్షులు కోట నీలవేణి మాట్లాడుతూ, మిషన్ జోష్ సంస్థకు ప్రభుత్వపరంగా అవసరమైన సహకారాన్ని అందించేందుకు ఎంపీ, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి తమ వంతు సాయం అందిస్తామన్నారు. జోష్ మిషన్ సంస్థ వ్యవస్థాపకులు, సంస్థ డైరెక్టర్ ఫాదర్ కె.వర్గీస్ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవగా భావించి పేదలకు తన శక్తి మేరకు చేస్తున్న సేవలను పేద ప్రజలు వినిగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు కోమటి శంకరరావు, డిసిసిబి మాజీ చైర్మన్ గుమ్ముడు సత్యదేవ్, ఎంపిటిసి పూడి దేవ, సర్పంచ్‌లు జి,రాజ్యలక్ష్మి, కోన లోవరాజు, వంజరి గంగరాజు, ఉప సర్పంచ్ పల్లా సింహాచలం, పందల దేవ, ఎంపిటిసి పైల చిన్నమ్మలు, మాజీ ఎంపిటిసి బంటు శ్రీను, మాజీ సర్పంచ్ గాలి రమణ బాబు, కర్రి అర్జున, శీలం శంకరరావు, సురేష్, గుమ్ముడు దొరబాబు పాల్గొన్నారు.

వినికిడి యంత్రాల పంపిణీకి పరీక్షలు

పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -నక్కపల్లి : వినికిడి లోపం ఉన్న వారిని గుర్తించి, మిషన్లు పంపిణీకి పరీక్షలు చేస్తున్నట్లు బిజెపి జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడుకోసూరి శ్రీనివాసరావు, దీన్ దయాళ్ శ్రావణ ఫౌండేషన్ రాష్ట్ర సమన్వయకర్త బి రవితేజ తెలిపారు. బుధవారం నక్కపల్లి సుబ్బరామిరెడ్డి కల్యాణమండపంలో దీన్‌దయాళ్ శ్రవణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆడియాలజిస్ట్, డాక్టర్ రాజు, టెక్నీషియన్ అరుణ్, ఆడియో మైత్రేషన్ గోపిక కలిసి వినికిడి లోపం ఉన్న వారికి పరీక్షలు చేశారు. వినికిడి లోపం ఉన్న వారిని గుర్తించి, వారందరికీ మిషన్లు అందజేస్తామని ఫౌండేషన్ ప్రతినిధి రవితేజ, కోసూరి శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రత్నకుమార్, శ్రీనివాసరావు, జోగినాయుడు, గణేష్, కనకరాజు, దార్ల శ్రీనివాస్, గొర్ల వెంకటరమణ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

● రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి : పాయకరావుపేట నియోజకవర్గాన్ని అత్యున్నతంగా అభివృద్ధి చేసి, మంచి మెజార్టీతో తనను గెలిపించి ఆదరించిన ప్రజల రుణం తీర్చుకుంటానని రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. బుధవారం నక్కపల్లిలోని మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద కూటమి నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ రాష్ట్రానికే తలమానికంగా నిలిచే ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ నక్కపల్లి ప్రాంతంలో ఏర్పాటౌతుందని, తద్వారా మరెన్నో ఎంఎస్ఎంఇలు వచ్చే అవకాశం ఉందన్నారు జంషెడ్‌పూర్ తరహాలో నక్కపల్లికూడా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా తనకు చెప్పారని మంత్రి అనిత అన్నారు.అనంతరం కూటమి నేతలు హోంమంత్రి అనితను ప్రశంసలతో ముంచెత్తారు. అనిత కృషి ఫలితంగా ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు ద్వారా పాయకరావుపేట చరిత్రలో ఆమె పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. ప్రత్యక్ష్యంగా ఎందరో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలతోపాటు పరోక్షంగా అనేకమందికి ఉపాధి లభిస్తుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌తో నక్కపల్లి ప్రాంతం అభివీద్ధి చెందుతుందని, అది అనితకే సాధ్యమన్నారు.

వికలాంగునికి ఎలక్ట్రానిక్ ట్రై సైకిల్ ఇస్తున్న అనిత

మాట నిలబెట్టుకున్న హోంమంత్రి అనిత

పాయకరావుపేట మండలం,సత్యవరం గ్రామానికి చెందిన వికలాంగుడు సుంకర ఆనంద్‌కు బుధవారం తన సొంతనిధులతో ఎలక్ట్రికల్ ట్రైసైకిల్ కొనివ్వడం ద్వారా హోంమంత్రి వంగలపూడి అనిత ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంతోపాటు మానవత్వం చాటుకున్నారు. చిన్నతనం నుండి శారీరక అంగవైకల్యంతో బాధపడుతూ కూరగాయల వ్యాపారంతో జీవనం సాగిస్తున్న ఆనంద్‌కు, సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా సత్యవరం వచ్చినప్పుడు ఎలక్ట్రికల్ ట్రై సైకిల్ కొనిస్తానని మాటిచ్చారు. ఇపుడా హామీని నిలబెట్టుకున్నారు.

పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ప్రజాశక్తి- నక్కపల్లి : గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిడిఒ డి సీతారామరాజు, డిప్యూటీ ఎంపిడిఒ చలపతిరావు అన్నారు. బుధవారం మండలంలో దేవవరం పంచాయతీ ఒడ్డిమెట్ట గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంటింటా చెత్త సేకరణను పర్యవేక్షించారు. తడిపొడి చెత్త సేకరణపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలని సూచించారు. మురుగునీరు నిల్వతో దోమలు, వాటి లార్వాలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వాటి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు తాగునీటికి క్లోరినేషన్ చేయాలన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ, మండల పరిధిలో ఈనెల 25న గురువారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ లైన్ల కింద చెట్లు తొలగింపు, ఇతర నిర్వహణ పనుల దృష్ట్యా విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఆపరేషన్స్ విభాగం నర్సీపట్నం డివిజన్ ఇఇ ఎవిఎస్ఎం.అప్పారావు తెలిపారు. నర్సీపట్నం పట్టణం, గ్రామీణ మండల వినియోగదారులు గమనించాలని సూచించారు.

బంగారు శతమానం బహూకరణ

ప్రజాశక్తి -మాడుగుల : మాడుగుల నవర వీధిలో వెలసిన దుర్గ పోలిపిల్లమ్మ తల్లి అమ్మవారికి అదే గ్రామానికి చెందిన కొరసాల అప్పన్నదొర, రాజేశ్వరి దంపతుల కుమారుడు శ్రీనివాసరావు, సత్యవేణి, కుమార్తె, అల్లుడు, బత్తుల గోవింద్, సౌజన్య దంపతులు బుధవారం బంగారు శతమానం బహూకరించారు. ఈ సందర్భంగా పట్టుచీర జాకెట్ పసుపు, కుంకుమ సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోండి

ప్రజాశక్తి -నక్కపల్లి : మొబైల్ ఆధార్ క్యాంప్‌లను మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ డి.సీతారామరాజు సూచించారు. బుధవారం . నక్కపల్లి సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ క్యాంప్‌ను పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. 25,26 తేదీల్లో కాగిత, ఉద్దండపురం సచివాలయాల్లో మొబైల్ ఆధార్ క్యాంపు నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కోరారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై శిక్షణ

మాడుగులలో శిక్షణలో మాట్లాడుతున్న ఎంపిడి గోపాలరావు

ప్రజాశక్తి- నక్కపల్లి : సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సర్పంచ్‌లు కృషి చేయాలని ఎంపిడిఒ డి సీతారామరాజు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపిపి రత్నం అధ్యక్షతన నక్కపల్లి, పాయకరావుపేట మండలాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై రెండు రోజుల శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన కల్పించడంలో సర్పంచ్‌లే కీలక పాత్ర పోషించాలన్నారు.

పేదరికం నిర్మూలన, పర్యావరణ పరిరక్షణ, సమానమైన, న్యాయమైన ప్రపంచాన్ని సృష్టించడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు.ఆహార భద్రత, నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, స్వచ్ఛమైన తాగునీరు అందించడం, పారిశుధ్య నిర్వహణలో లక్ష్యసాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ చలపతిరావు పాల్గొన్నారు.

మాడుగుల : గ్రామాల సుస్థిర అభివృద్ధే లక్ష్యంగా సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పనిచేయాలని ఇన్‌ఛార్జి ఎంపిడిఒ జివిఎస్. గోపాలరావు అన్నారు. బుధవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో రెండు రోజుల శిక్షణలో పంచాయతీలకు మంజూరైన నిధులను ప్రాధాన్యతా అవసరాలను దృష్టిలో పెట్టుకుని వెచ్చించాలన్నారు. పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ పిఎల్. సతీష్‌కుమార్, ట్రైనీలు హుస్సేన్, నాగేశ్వరరావు, తిరుమల దేవి పాల్గొన్నారు.

రోలుగుంట : సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు, పంచాయతీరాజ్ చట్టాలు, సర్పంచ్‌ల విధులు, బాధ్యతలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది చేయాల్సిన పనులపై రెండు రోజుల శిక్షణను ఎంపిడిఒ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ట్రైనీలు వరలక్ష్మి, మౌనిక వివిధ అంశాల వారీగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చోడవరం : సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు – స్థానికీకరణ అన్న అంశంపై చోడవరం, చీడికాడ మండలాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రెండు మండలాల సర్పంచ్‌లు, పంచాయితీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీవోలు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయంలో ధ్వజారోహణ

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రాచీన పుణ్యక్షేత్రమైన ఉపమాక వెంకన్న ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఆలయంలో ప్రధాన అర్చకులు గొట్టుముక్కల వరప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు, శేషాచార్యులు ఆధ్వర్యంలో ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఉత్సవమూర్తులను పెద్ద పల్లకిలో వేయింపజేసి తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.

కాలినడకన కనకదుర్గమ్మ సన్నిధికి..

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని లింగంపేట గ్రామానికి చెందిన భవానీ భక్తులు కాలినడకన విజయవాడ కనకదుర్గమ్మ దర్శనానికి బుధవారం పాదయాత్రగా బయలుదేరారు. వీరికి మార్గదర్శిగా గురు భవాని కర్రి గణేష్ ఉన్నారు. అంబటి ప్రసాద్, మరిస గుర్రయ్య నాయుడు, ముచ్చకర్ల నరసింగరావు, కర్రి గణేష్, గొంతిన తాతాజీ, కొత్తెం ప్రసాద్, డి.సత్తిబాబు, మరిస సోమునాయుడు తదితర భవానీ భక్తులు దీక్ష విరమణ, అమ్మవారి దర్శనానికి తరలివెళ్లారు. వారి పాదయాత్ర విజయవంతంగా జరగాలని గ్రామస్తులు ఆకాంక్షిస్తూ వారిని సాగనంపారు.

వి జ్యూయలరీ మార్ట్ రెండో షోరూమ్ ప్రారంభం

జ్యోతిప్రజ్వలనలో పాల్గొన్న వ్యాపారవేత్త సర్వేశ్వరరావు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖలోని సంపత్ వినాయక టెంపుల్ సమీపంలో వి జ్యూయలరీ మార్ట్ వారి రెండో షోరూంను బుధవారం ఉదయం శ్రీకన్య ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ కెఎన్‌విఎస్.గురుమూర్తి మొదటి కొనుగోలు చేసి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వి-జ్యూయలరీ మార్ట్ సభ్యులు కోలా బాబూరావు, కాకి గంగరాజు, పట్నాల శ్రీనువాసరావు, వూన వినిత్ మీడియాతో మాట్లాడుతూ తమ రెండో షోరూమును మెయిన్ రోడ్డుకు దగ్గరగా ఏర్పాటు చేశామన్నారు. వినూత్నమైన కలెక్షన్లతో ప్రారంభోత్సవ ఆఫర్‌గా అన్ని రకాల 22 క్యారెట్ బంగారు ఆభరణాలను ప్రస్తుత మార్కెట్ ధర ఎక్కువగా ఉన్నా తమ వద్ద గ్రామును రూ.9987కే అందిస్తున్నామని తెలిపారు. తరుగు 6.96 శాతం నుండి అన్ని రకాల ఆభరణాలను పొందవచ్చునని పేర్కొన్నారు. సాధారణ వెండి వస్తువులపై తరుగు, మజూరి లేదని, జిఎస్‌టిని కూడా తామే చెల్లిస్తామని అన్నారు. అదనంగా కేజీ వెండి వస్తువుల కొనుగోలుపై కేజీకి రూ.15 వేల వరకూ తగ్గింపు అందిస్తున్నామని అన్నారు. ఈ ఆఫర్ కొన్ని రోజులు మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపారు. జ్యోతి ప్రజ్వలన కార్యక్రమంలో వ్యాపారవేత్త పి.సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి రుణాలు

మాట్లాడుతున్న సొసైటీ చైర్మన్ రాజు

ప్రజాశక్తి -కొత్తకోట : జాయింట్ లైవలిటీ గ్రూపులు (జెఎల్‌జి) ద్వారా మహిళల స్వయం ఉపాధి, ఆర్థికాభివృద్ధికి సులభ వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించేలా సహకార రుణాలు అందిస్తామని కొత్తకోట పిఎసిఎస్ చైర్‌పర్సన్ పివిఎస్‌ఎన్ రాజు చెప్పారు. బుధవారం సొసైటీ మహాజనసభకు అధ్యక్షత వహించిన రాజు మాట్లాడుతూ 67 ఏళ్లుగా సభ్య రైతులకు ఎనలేని సేవలు అందిస్తున్న ఈ సొసైటీ, ఇకమీదట సేవలను మరింత విస్తృతం చేసేందుకు ప్రణాళికా ప్రకారం కృషి చేస్తామన్నారు. డ్వాక్రా గ్రూపు మహిళలతో 200 నుంచి 300 వరకు జెఎల్‌జి గ్రూపులు ఏర్పాటు చేయించి, రుణాలిచ్చి స్వయంఉపాధి యూనిట్లు స్థాపనకు చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ, వ్యవసాయేతర రుణాలు, ధాన్యం కొనుగోలు, ఎరువుల విక్రయాలుి ద్వారా రైతుల అవసరాలు తీరుస్తామన్నారు. .కొత్తకోట సొసైటీని జిల్లాలో మొదటి స్థానంలో నిలిపేలా కృషి చేస్తానన్నారు

ఈ సందర్భంగా షేరు ధనం తగ్గించాలని, పాడిపశువులు కొనుగోలుకు, పశువుల షెడ్‌ల నిర్మాణాలకు రుణాలివ్వాలని రైతులు జంపా ఈశ్వరరావు, కొప్పాక నాయుడు కోరారు. సొసైటీ ద్వారా యూరియాను రూ.270 ఎంఆర్‌పి ధరకే విక్రయించాలని పులకంతం రమణాజీ తదితర రైతులు కోరారు. సొసైటీ సిఇఒ గుర్రం రఘు రూ.12.79 కోట్ల టర్నోవర్ కలిగిన సొసైటీ వార్షిక ఆదాయం, ఆర్థిక లావాదేవీలను మహాజన సభలో వివరించారు. సొసైటీ త్రిమెన్ కమిటీ సభ్యులు బి.గణేష్, ఎర్రునాయుడు, మాజీ అధ్యక్షులు జి. సత్యదేవ్, ఆదిమూర్తి, రావికమతం, రోలుగుంట మండలాల జనసేన అధ్యక్షులు మైచర్ల నాయుడు, మహరాజు, కొత్తకోట సర్పంచి కోన లోవరాజు, ఉప సర్పంచి పందల దేవా తదితరులు పాల్గొన్నారు.

బల్క్‌డ్రగ్ పార్కుపై కన్నెర్ర

- రాజయ్యపేటలో రోడ్డెక్కిన మత్స్యకారులు
- రహదారి పనులు, వాహనాల అడ్డగింత
- పోలీసు చర్యలతో ఉద్రిక్తత

రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న మత్స్యకార మహిళలు

ప్రజాశక్తి నక్కపల్లి : బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఇన్నాళ్లు శాంతియుతంగా పోరాడుతున్న రాజయ్యపేట మత్స్యకారులు ఆందోళనను ఉధృతం చేశారు. బుధవారం రాత్రి రోడ్డెక్కి వాహనాలను అడ్డుకుని నిరసన చేపట్టడంలో రాజయ్యపేటలో ఉద్రిక్తత నెలకొంది. బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు కదం తొక్కారు. శాంతియుత పోరాటాన్ని ఉధతం చేశారు. పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో తోపులాటలు, వాగ్వాదం చోటుచేసుకుంది.

మండలంలో రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే నిరాహార దీక్షలు బుధవారం 11 వ రోజుకు చేరింది. 11 రోజులుగా శాంతియుతంగా నిరసన చేపడుతున్నా, ఎటువంటి స్పందన లేకపోవడంతో మత్స్యకారులు కన్నెర్ర చేసారు. గ్రామంలోని మత్స్యకారులంతా చిన్నాపెద్ద అని తేడా లేకుండా మహిళలు సైతం రోడ్డెక్కారు. గ్రామానికి వచ్చే మార్గంలో నూకతాత ఆలయం వద్దకు భారీగా జనం తరలివచ్చి టెంట్ వేసుకుని ఆందోళనకు ప్రయత్నించగా, సిఐలు కుమారస్వామి,రామకృష్ణ పోలీస్ సిబ్బందితో వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు,ఆందోళనకారుల మధ్య తోపులాటలు, వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసులు ఎదిరించి మత్స్యకారులు రోడ్డుపై బైఠాయించారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు చేపడుతున్న రోడ్డు పనులను, వాహనాలను అడ్డగించారు. బల్క్‌డ్రగ్ పార్క్ నిలుపుదల చేయాలని, హెూంమంత్రి వంగలపూడి అనిత న్యాయం చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సముద్రమే తమ జీవనాధారమని, వేట తప్ప మరో వృత్తి తమకు తెలియదని, బల్క్ డ్రగ్ ఏర్పాటు చేసి తమ జీవితాలను నాశనం చేయొద్దని నినదించారు. ఇప్పటికే తీర ప్రాంతం కాలుష్యం అవ్వడంతో, మత్స్య సంపద నశిస్తుండడంతో తమకు ఉపాధి లేకుండా పోయిందన్నారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. బల్క్ డ్రగ్ నిలుపుదల చేసే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని మత్స్యకారులు ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. రోడ్డుకు అడ్డంగా మంటలు వేసి నిరసన తెలిపారు. రాత్రంతా ఇక్కడే ఉండి ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు మత్స్యకారుల ఆందోళనకు సంఘీభావం తెలిపి, పాల్గొన్నారు.

రాత్రి వేళ కూడా ఆందోళన కొనసాగించిన మత్స్యకారులు

డిఎస్‌సికి ఎంపికైన అభ్యర్థులకు భోజనాలు

ప్రజాశక్తి నక్కపల్లి : మెగా డిఎస్‌సిలో ఎంపికై, అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి ఈనెల 25న నియామక పత్రాలు అందుకునేందుకు తరలివెళుతున్న కొత్త ఉపాధ్యాయులు, వారి కుటుంబసభ్యులకు బుధవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, గురూస్ స్కూల్‌లో రెండు వేలమందికి ఉచిత భోజన వసతి ఏర్పాటు చేశారు. వాటి అమలు తీరును డిఇఒ జి అప్పారావు నాయుడు, పాఠశాల విద్య ఆర్‌జెడి బి. విజయభాస్కర్, డిప్యూటీ డిఇఒ పెన్నాడ అప్పారావు దగ్గరుండి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఎంఇఒలు కె. నరేష్, రుత్తల నాగన్నదొర, హెచ్‌ఎం వేమగిరి నూకరాజు పాల్గొన్నారు.

భోజనాలు చేస్తున్న మెగా డిఎస్‌సికి ఎంపికైన మాస్టార్లు

నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు బాలాజీ

ప్రజాశక్తి-ఎస్.రాయవరం : ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అతిక్రమిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షులు ఎం.బాలాజీ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని వినయ్ ప్రైవేటు స్కూల్‌ను బుధవారం బాలాజీ పరిశీలించారు. ఆ స్కూల్ విద్యార్థులను తరగతి గదుల్లో కాకుండా కొబ్బరి తోటలో క్లాసులను నిర్వహించడాన్ని గమనించారు. కొబ్బరి తోటలో క్లాసులు నిర్వహించడం వలన ఏవైనా విషపూరిత జీవులు విద్యార్థులను ఏదైనా కుడితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. దసరా సెలవులు ఇవ్వకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేయడం దారుణమన్నారు. దసరా సెలవుల్లో క్లాస్‌లు నిర్వహించడంపై విద్యార్థులకు తమకు ఫోన్లు చేసి ఫిర్యాదు చేస్తున్నారని చెప్పారు. ఏ విద్యార్థి అయినా పాఠశాలకు హాజరు కాకుంటే రూ.200 చెల్లించవలసి వస్తుందని పేర్కొన్నారు. నిబంధనలు పాటించకుంటే స్కూల్ లైసెన్స్‌ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సంఘటనపై వినయ్ విద్యా సంస్థ కరస్పాండెంట్ బత్తుల వాసును వివరణ కోరగా ప్రభుత్వ నియమాలను తాము అతిక్రమించలేదని, విద్యార్థుల సందేహాలను తీర్చడానికి ఒక ఉపాధ్యాయుడు వచ్చారని చెప్పారు. పాఠశాలలో ఏ విధమైన క్లాసులు నిర్వహించడం లేదని, ఎవరి వద్దా రుసుము వసూలు చేయటం లేదని స్పష్టం చేశారు.

జివిఎంసి విలీన గ్రామాల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : జివిఎంసి విలీన గ్రామాల సమస్యలను పరిష్కరించాలని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ బుధవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. జీవీఎంసీలో విలీనమైన గ్రామాలలో డ్రైనేజ్, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందలేదన్నారు. అనకాపల్లి జోనల్ పరిధిలో 300 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, టౌన్ ప్లానింగ్ అధికారులు అయితే లేనేలేరని పేర్కొన్నారు. డ్రైనేజీ అధ్వానంగా ఉందన్నారు. అనకాపల్లి మున్సిపల్ ఆఫీస్ ఒక డంపింగ్ యార్డ్ లాగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. జోనల్ కమిషన్ నియోజవర్గ స్థాయిలో విభజిస్తే ఆ ప్రాంత అభివృద్ధికి దోహదపడుతుందని చెప్పారు.

పి4పై సచివాలయ సిబ్బందికి అవగాహన

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మార్గదర్శకులు, బంగారు కుటుంబాలను సమన్వయం చేసుకుంటూ పేదరిక నిర్మూలనకు సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ఎంపీడీవో శివప్రసాద్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో పి4 అమలుపై మండలంలోని సచివాలయ సిబ్బందికి బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి4కు సంబంధించిన యాప్‌లో పూర్తి వివరాలు నమోదు చేసి బంగారు కుటుంబాలకు పూర్తి సహకారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పారదర్శకంగా ఉపాధ్యాయ పోస్టుల ఎంపిక

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఇచ్చిన హామీ ప్రకారం మెగా డీఎస్సీ నిర్వహించి 16,467 పోస్టులను పారనదర్శకంగా భర్తీ చేస్నిట్లు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ధ నాగ జగదీశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ డిఎస్‌సి నిర్వహణలో నిరుద్యోగులకు కూటమిపై నమ్మకం కలిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బుద్ధ కాశీ విశ్వేశ్వరరావు, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ఉద్యోగ విరమణ మరియు షష్ఠిపూర్తి శుభాకాంక్షలు

అతి తక్కువ ధరతో మీ ప్రకటన వేయబడును.

మీ సేవలు మరువలేనివి, మీరెక్కడున్నా మీ శ్రేయస్సును కోరుకుంటాం, అందించండి. ప్రజాశక్తి ద్వారా శుభాకాంక్షలు

మీ సహోద్యోగులు, మీ కుటుంబ సభ్యులు, బంధుమిత్రులలో ఎవరైనా రిటైర్ అవుతున్నారా? మరియు షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు తెలపాలనుకుంటున్నారా? అయితే అందించండి వారికి అభినందన కుసుమాలు, ఆకాంక్షించండి వారి సుఖమయ జీవితాన్ని ప్రజాశక్తి ద్వారా తెలియజేయండి.

ఉద్యోగ విరమణ
షష్ఠిపూర్తి మహోత్సవ శుభాకాంక్షలు

మరిన్ని వివరాలకు మా స్థానిక ప్రతినిధులను సంప్రదించండి

సిటీ	9490099125	పూర్ణమార్కెట్	9490099676
మధురవాడ	8008596645	జగదాంబ	9490099434
గాజువాక	9849392359	జివియంసి	9490099483
అనకాపల్లి	8008736188	ద్వారకానగర్	9490099672
చోడవరం	9490099141	కంచరపాలెం	9490099135
నర్సీపట్నం	9440280411	మాదవధార	9490099675
పాడేరు	9490099142		
రంపచోడవరం	9440165617		